శనివారం
06-04-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 285
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కీలక సముద్ర మార్గం మూసివేత

కొపెన్హాజెన్: నాటో దేశమైన డెన్మార్క్‌కు చెందిన ఓ యుద్ధ నౌకపై ఉన్న మిసైల్ లాంచర్లో సమస్య తలెత్తింది. దీంతో దాని పరిధిలోకి వచ్చే గ్రేట్ బెల్ట్ సముద్ర మార్గాన్ని తాత్కాలికంగా మూసివేశారు. ప్రపంచంలో అత్యంత రద్దీగా ఉండే సముద్ర మార్గాల్లో ఇది కూడా ఒకటి. 'కొన్ని రకాల పరీక్షల సమయంలో నౌకపై ఉన్న హర్పూన్ క్షిపణి వ్యవస్థ గురువారం క్రియాశీలం అయింది. దీనిని ఇప్పటివరకు సరి చేయలేదు. సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక బృందాలను రప్పిస్తున్నాం. బూస్టర్‌ను నిర్వీర్యం చేసేవరకు ముప్పు పొంచే ఉంటుంది. అది ఏక్షణమైనా గాల్లోకి ఎగిరి విధ్వంసం సృష్టించవచ్చు' అని డానిష్ మిలటరీ ఓ ప్రకటనలో పేర్కొంది. అయితే లాంచర్ గ్రేట్ బెల్ట్ వంతెన దిశగా లేదని తెలిపింది.

గుంటూరు ఎంపీ అభ్యర్థి జంగాల

- ఒక ఎంపీ, ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో సీపీఐ పోటీ
- అభ్యర్థుల జాబితా వెల్లడించిన రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ నుంచి భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తరపున పోటీచేసే అభ్యర్థుల జాబితాను ఆ పార్టీ రాష్ట్ర కమిటీ శుక్రవారం ప్రకటించింది. ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్ పార్టీతో కుదిరిన అవగాహన మేరకు ఒక పార్లమెంట్, ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో బరిలోకి దిగనున్న అభ్యర్థుల జాబితాను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ వెల్లడించారు. ఈ మేరకు ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇండియా కూటమి పక్షాలైన కాంగ్రెస్, సీపీఎంతో వివిధ దఫాలుగా జరిగిన చర్చల అనంతరం కుదిరిన ఒప్పందం మేరకు సీపీఐ ఒక పార్లమెంటు, 8 అసెంబ్లీ స్థానాల్లో పోటీచేయనుందని పేర్కొన్నారు. సీపీఎం పోటీచేసే స్థానాల్లో ఆ పార్టీకి... మిగిలిన చోట్ల కాంగ్రెస్ పార్టీకి మద్దతునివ్వాలని సీపీఐ నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. సీపీఐ పోటీ చేస్తున్న స్థానాల్లో ఖరారైన పార్టీ అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు.

గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి - జంగాల అజయ్‌కుమార్

అసెంబ్లీ అభ్యర్థులు:
- విశాఖ పశ్చిమ- అత్తిలి విమల
- ఏలూరు - బండి వెంకటేశ్వరరావు
- విజయవాడ పశ్చిమ - జి.కోటేశ్వరరావు
- అనంతపురం అర్బన్ - సి.జాఫర్
- పత్తికొండ - పి.రామచంద్రయ్య
- తిరుపతి - పి.మురళి
- రాజంపేట - భూక్య విశ్వనాథ నాయక్
- కమలాపురం - గాలి చంద్ర

పించన్ల పంపిణీలో డ్రామాలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

8లో

ఉద్యోగాలు, సంపద, సంక్షేమం

- 'న్యాయ్ పత్ర' పేరుతో కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల
- పేదల జీవితాల్లో వెలుగు నింపుతామని హామీ
- యువత, రైతులు, మహిళలపై వరాల జల్లు

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 'న్యాయ్‌పత్ర' పేరుతో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో విడుదల చేసింది. ఉద్యోగాల కల్పన, సంపద సృష్టి, సంక్షేమం సూత్రాలపై ఈ మేనిఫెస్టోను రూపొందించినట్లు స్పష్టం చేసింది. దిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ముఖ్య నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ తదితరులు న్యాయ్‌పత్ర పేరుతో మేనిఫెస్టోను ప్రకటించారు. యువత, మహిళలే లక్ష్యంగా చేసుకుని రూపొందించిన మేనిఫోస్టోలో సామాజిక సంక్షేమ పథకాలతో పాటు 25 గ్యారెంటీలను చేర్చింది. గత పదేళ్లలో పెట్రోల్, డీజిల్ ధరలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో.. ఇంధనం ధరలను తగ్గిస్తామని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. సైనిక నియామకాల విషయంలో కేంద్రం ఇటీవల తీసుకొచ్చిన అగ్నివీర్ పథకాన్ని రద్దు చేస్తామని, తిరిగి పాత విధానాన్నే కొనసాగిస్తామని మేనిఫెస్టోలో పేర్కొంది. మహాలక్ష్మీ పథకం ద్వారా ప్రతి పేద కుటుంబానికి ఏడాదికి లక్ష రూపాయల ఆర్థిక సాయం చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అలాగే మహిళలకు ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని తెలిపింది. రైతుల కు రుణమాఫీతో పాటు పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని స్పష్టం చేసింది. అంతే కాకుండా వ్యవసాయ పరికరాలకు జీఎస్టీ మినహాయింపు కల్పించే అంశాన్ని సైతం మేనిఫెస్టోలో చేర్చింది. దేశవ్యాప్తంగా కులగణన చేపడతామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. నిరుద్యోగ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని 30 లక్షల ఉద్యోగాలిస్తామని ప్రకటించింది. రైల్వేల ప్రైవేటీకరణను రద్దు చేస్తామని కాంగ్రెస్ తెలిపింది. అలాగే రూ.5000 కోట్లతో యువతకు స్టార్టప్ ఫండ్, నిరుద్యోగ భృతి ద్వారా నిరుద్యోగ యువత ఖాతాల్లోకి నగదు బదిలీ, విద్యా రుణాల వడ్డీ రేటు తగ్గింపు, చిన్నతరహా పరిశ్రమల రుణాలను కొంతమేరకు మాఫీ చేసి... తక్కువ వడ్డీకి రుణాల పంపిణీ, దేశవ్యాప్తంగా 8 కోట్ల కాంగ్రెస్ గ్యారెంటీ కార్డుల పంపిణీ వంటి హామీలతో మేనిఫెస్టో రూపొందించింది.

మోదీ పాలనలో అన్నివర్గాలకు అన్యాయం: ఖర్గే

మేనిఫెస్టో విడుదల సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ... ధనవంతుల కోసమే మోదీ ప్రభుత్వం పనిచేసిందని విమర్శించారు. మోదీ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ గతంలో దేశాభివృద్ధికి పాటుపడిందని గుర్తుచేశారు. మళ్లీ అధికారంలోకి రాగానే అభివృద్ధి కొనసాగిస్తామని ఖర్గే హామీ ఇచ్చారు. "మా మేనిఫెస్టోను పేద ప్రజలకు అంకితం ఇస్తున్నాం. దేశ రాజకీయ చరిత్రలో న్యాయ పత్రాలుగా దీనిని ప్రజలు గుర్తుంచుకుంటారు. రాహుల్ గాంధీ చేపట్టిన 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'లో అందిస్తామన్న ఐదు న్యాయాలు, 25 గ్యారంటీలు దీనిలో ఉన్నాయి. మోదీ హయాంలో ఒక్కటైనా పెద్ద ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి ఉద్యోగాలు ఇచ్చారా? కేవలం తిట్లు తప్పితే ఆయన పాలనలో మరేమీ మేం వినలేదు. ప్రతిపక్ష నాయకులను జైళ్లలో పెడుతున్నారు. ఎన్నికల్లో అందరికీ సమాన అవకాశాలు కల్పించడంలేదు. మా పార్టీపై రూ.3,500 కోట్ల ఫైన్ విధించారు. నేడు మాపై జరిగినవి రేపు మీడియాపై కూడా జరగవచ్చు. దేశ ప్రజాస్వామ్యాన్ని బతికించేందుకు ప్రజలు ఏకమై

- మిగతా 2 లో

'ఇండియా' ప్రధాని ఖరారు అప్పడే: రాహుల్

రాహుల్ గాంధీ మాట్లాడుతూ... దేశంలో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసేందుకు ప్రయత్నిస్తున్న వారికి, వాటిని పరిరక్షించేందుకు ప్రయత్నిస్తున్న వారికి మధ్య ఈ ఎన్నికల్లో ప్రధాన పోరు జరుగుతుందన్నారు. ఈ పోరాటంలో గెలిచిన తర్వాత, అత్యధిక మంది ప్రజల ప్రయోజనాలను చూసుకోవడం చాలా ముఖ్యం అని కాంగ్రెస్ నమ్ముతోందన్నారు. భారత్ రెండు లేదా మూడు పెద్ద వ్యాపారాల కోసం నడవదని... మెజారిటీ ప్రజల కోసం పనిచేస్తుందని తెలిపారు. భారత్ గుత్తాధిపత్యం ఉండే దేశం కాదు. వ్యాపారాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండే దేశమన్నారు. ఇవి ప్రాథమికంగా భిన్నమైన ఎన్నికలని రాహుల్ పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ తయారు చేసిన మేనిఫెస్టో కాదన్న రాహుల్... రైతులు, మహిళలు, శ్రామికుల మేనిఫెస్టోగా అభివర్ణించారు. దేశంలోని అన్నివర్గాల ప్రజలతో మాట్లాడాకే మేనిఫెస్టో రూపొందించామని తెలిపారు. ఎన్నికల బాండ్ల ద్వారా బీజేపీ నిధులెలా సమకూర్చుకుందో తేటతెల్లమైందని, సీబీఐ, ఈడీని ప్రయోగించి నిధులెలా సమకూర్చుకుందో రుజువైందన్నారు. తమ పార్టీ బ్యాంక్ ఖాతాలను సీజ్ చేశారన్న రాహుల్... సీబీఐ, ఈడీని ప్రయోగించి బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు. 'ఇవి 2024 ఎన్నికలు కావు... ప్రజాస్వామ్య పరిరక్షణకు యుద్ధం' అన్నారు. భావసారూప్య పార్టీలతో ఎన్నికల బరిలోకి దిగామని తెలిపారు. విజయం సాధించాక భాగస్వామ్య పార్టీలన్నీ ప్రధాని ఎవరనేది నిర్ణయిస్తాయని స్పష్టం చేశారు.

అవినాశ్‌రెడ్డిని ఓడిద్దాం

- హంతకుడికి టికెట్ ఇవ్వడం అన్యాయం
- రాష్ట్రం బీజేపీకి తాకట్టు
- వైసీపీని గద్దెదించడమే ధ్యేయం: షర్మిల

విశాలాంధ్ర-వేంపల్లె: వైసీపీ కడప లోక్‌సభ అభ్యర్థిగా పోటీచేస్తున్న అవినాశ్‌రెడ్డిని ఓడిద్దామని పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచార ంలో భాగంగా శుక్రవారం కడప జిల్లా బద్వేల్ నియోజకవర్గ పరిధిలోని పోరుమామిళ్ల మండలంలో ఆమె పర్యటించారు. షర్మిల మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను ముఖ్యమంత్రి జగన్ బీజేపీకి తాకట్టుపెట్టారని విమర్శించారు. చిన్నాన్న వివేకా హత్య కేసులో హంతకుడిగా అభియోగం ఎదుర్కొంటున్న అవినాశ్‌రెడ్డికి టికెట్ కేటాయించడం అన్యాయమన్నారు. అందుకే అవినాశ్‌రెడ్డిని ఓడించేందుకు తాను కాంగ్రెస్‌పార్టీ తరుపున కడప లోక్‌సభకు పోటీ చేస్తున్నానన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదింపడమే తమ ధ్యేయమన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ మనిషి అని, ముఖ్యమంత్రిగా ఎన్నో అద్భుతాలు చేశారన్నారు. ప్రజల హృదయాల్లో వైఎస్సార్ చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. విభజన హామీలు ఒక్కటీ అమలు కాలేదన్నారు. ప్రత్యేక హోదా లేదు, కడప స్టీల్ లేదన్నారు. ఈరోజు వైఎస్సార్ బిడ్డ కడప ఎంపీగా పోటీ చేయడానికి జగనే కారణమన్నారు. బాబాయ్‌ను చంపిన హంతకుడికి మళ్లీ టికెట్

- మిగతా 2 లో

నెల్లూరులో నెట్టుకొచ్చేదెలా?

- వైసీపీ అధినేతలో అంతర్మథనం
- బస్సుయాత్ర ఆపి మరీ వ్యూహరచన
- కీలక నేతలు పార్టీని వీడటంతో కలవరం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉమ్మడి నెల్లూరుజిల్లా పార్టీ పరిస్థితిపై వైసీపీ అధినేత కలవరం చెందుతున్నారు. దీంతో బస్సు యాత్రకు ఒక రోజు విరామం ఇచ్చి, రోజంతా సమీక్షలకే జగన్ పరిమితమయ్యారు. వైసీపీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ అభ్యర్థి(రాజ్యసభ సభ్యులు) ఆ పార్టీకి దూరమయ్యారు. 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిని ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో టీడీపీ అభ్యర్థికి ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు ఓట్లు వేశారన్న ప్రాథమిక ఆధారాలు వైసీపీకి లభించడంతో వారిపై వేటు పడిరది. అంతకుముందే వీరు వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలుగా పేరొందారు. ప్రభుత్వంపై విమర్శలకు దిగుతూ ఇరకాటంలో పెట్టారు. వారిపై వైసీపీ నేతల ఫిర్యాదు మేరకు అనర్హత వేటు పడింది. ఈ ముగ్గురు ఎమ్మెల్యేలలో కోటంరెడ్డి, ఆనం టీడీపీ నుంచి పోటీ చేస్తుండగా, మరో ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి ఎక్కడా టిక్కెట్ లభించలేదు. వైసీపీ ఆవిర్భావం నుంచి నెల్లూరుజిల్లాలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గట్టి నేతగా ఉన్నారు. ఆయన సేవలను గుర్తించి వైసీపీ అధిష్ఠానం రాజ్యసభకు ఎంపిక చేసింది. ఈ ఎన్నికల్లో తొలుత నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డినే బరిలోకి దించింది. అయితే నెల్లూరు పార్లమెంట్ పరిధిలో కొందరి అసెంబ్లీ సీట్లను మార్చాలని, తన భార్యకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని వేమిరెడ్డి డిమాండ్ చేయడం, దానిపై అధిష్ఠానం పట్టించుకోకపోవడం వెరసి ఆయన పార్టీకి, పదవులకు రాజీనామా చేశారు. ప్రస్తుతం నెల్లూరు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. ఇలా నెల్లూరులో వైసీపీ కోటలు బీటలువారే పరిస్థితులున్నాయి. వైసీపీ ఆవిర్భావం నుంచి నెల్లూరు ఎంపీతోపాటు ఆ జిల్లాలో ఆ పార్టీకి అత్యధిక సీట్లు వస్తున్నాయి. 2019 ఎన్నికల్లో నెల్లూరు ఎంపీతోపాటు పదికి పది అసెంబ్లీ స్థానాలను వైసీపీ కైవసం చేసుకుంది. టీడీపీ అధినేత చంద్రబాబు వ్యూహంలో భాగంగా నెల్లూరు వైసీపీ ముఖ్య నేతలను టీడీపీలోకి రప్పించగలిగారు. దీంతో రాబోయే ఎన్నికల్లో నెల్లూరుపై వైసీపీకి టెన్షన్ పట్టుకుంది. బలమైన ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని టీడీపీ వైపుకు వెళ్లడంతో అక్కడ వైసీపీ గెలుపునకు ఆటంకం ఏర్పడింది. వేమిరెడ్డికి దీటుగా చాలా మంది పేర్లను వైసీపీ పరిశీలించింది. అందుకు ఎవ్వరూ సరితూగకపోవడంతో చివరకు రాజ్యసభ సభ్యుడు, సీనియర్ నేత విజయసాయిరెడ్డినే సీఎం జగన్ రంగంలోకి దించారు. దీంతో నెల్లూరు ఎంపీ పోరుపై ఉత్కంఠ నెలకొంది. ఉమ్మడి నెల్లూరుజిల్లాలో పట్టునిలుపుకునేందుకు సీఎం జగన్ తన బస్సు యాత్రను ఆపేసి మరీ రోజంతా సమీక్షలకే పరిమితం కావడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఇప్పటికే నెల్లూరు టీడీపీ నుంచి వైసీపీలోకి ముఖ్య నేతలు చేరారు. మరికొందర్ని చేర్పించేలా వైసీపీ యత్నిస్తోంది.

రాయలసీమలో ముగిసిన 'మేమంతా సిద్ధం'

మేమంతా సిద్ధం పేరుతో సీఎం జగన్ నిర్వహిస్తున్న బస్సు యాత్ర రాయలసీమ జిల్లాల్లో ముగిసింది. వైఎస్ఆర్ కడప, నంద్యాల, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఎనిమిదిరోజులపాటు యాత్ర కొనసాగింది. ఎనిమిది రోజులపాటు రాయలసీమలో ఆరు బహిరంగ సభలు, మూడు ముఖాముఖీ సభల్లో జగన్ పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్ర ఈనెల 21వ తేదీతో పూర్తి కానుంది. రాయలసీమ నుంచి ఉమ్మడి నెల్లూరుజిల్లాకు బస్సు యాత్ర చేరడంతో సీఎం కొంతసమయం విరామం ఇచ్చారు. ఈలోగా రాయలసీమ జిల్లా బస్సు యాత్ర ద్వారా వచ్చిన అనుభవాలు, ప్రజల నుంచి వచ్చిన స్పందన, భవిష్యత్‌లో

- మిగతా 2 లో

మదర్సా విద్యార్థులకు ఊరట

అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్ మదర్సాల్లోని 17 లక్షల మంది విద్యార్థులకు సుప్రీంకోర్టు శుక్రవారం భారీ ఉపశమనం కలిగించింది. యూపీ బోర్డ్ ఆఫ్ మదర్సా ఎడ్యుకేషన్ యాక్ట్-2004ను రద్దు చేస్తూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే విధించింది. ఈ తీర్పు 16 వేల మదర్సాల్లోని 17 లక్షల విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతోందని పేర్కొంది. మ్యాథ్స్, సోషల్ స్టడీస్, సైన్స్ సబ్జెక్టులను కూడా మదర్సాల్లో

- మిగతా 2 లో



ఎవరైనా నేరుగా ఫిర్యాదు చేయొచ్చు

- ప్రతిరోజూ సా.4-5 గంటల మధ్య స్వీకరణ
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, విజ్ఞాపనలను ప్రతిరోజూ సాయంత్రం నాలుగు-ఐదు గంటల మధ్య తమకు నేరుగా అందజేయవచ్చని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్ మీనా

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అప్పటికీ చెప్పాను, జనం ఎండల్లో మంటెక్కి ఉన్నారు.. మీ ప్రభుత్వం సాధించిన ఘన విజయాలు చెప్పొద్దని!

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఎలా?

- పరిశ్రమ ఉద్యోగులు, భాగస్వాములను సంప్రదించారా?
- సీఎం జగన్ లేఖపై మీ నిర్ణయం ఏమిటి?
- కేంద్రాన్ని సూటిగా ప్రశ్నించిన హైకోర్టు
- తదుపరి విచారణ 24కి వాయిదా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏ చట్ట నిబంధనల ప్రకారం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని హైకోర్టు సూటిగా ప్రశ్నించింది. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై కేంద్ర కేబినెట్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కేఏపాల్ తదితరులు దాఖలు చేసిన వ్యాజ్యాలపై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈసందర్భంగా కేంద్రానికి కొన్ని ప్రశ్నలు సూటిగా సంధించింది. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించాలని నిర్ణయం తీసుకునే ముందుగా

- మిగతా 2 లో

పార్టీ ఐక్యతకు సునీత బెస్ట్

ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్

న్యూఢిల్లీ: ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీని కలిసి ఉంచడానికి దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ భార్య సునీత ఉత్తమమైన వ్యక్తి అని ఆప్ నాయకుడు సౌరభ్ భరద్వాజ్ అన్నారు. ఆమె ఉనికి క్యాడర్‌పై 'సానుకూల ప్రభావం' చూపిందని నొక్కి చెప్పారు. వార్తా సంస్థ ప్రధాన కార్యాలయంలో పీటీఐ సంపాదకులతో దిల్లీ ప్రభుత్వంలో కేబినెట్ మంత్రి కూడా అయిన భరద్వాజ్ మాట్లాడుతూ ప్రస్తుతం జైలులో ఉన్న దిల్లీ ముఖ్యమంత్రికి తాను 'దూత' అని సునీతా కేజ్రీవాల్ ఎప్పుడూ చెబుతూ ఉంటారని తెలిపారు. పార్టీ రాజకీయాలు దాని మేనిఫెస్టో చుట్టూ మాత్రమే తిరుగుతాయని పేర్కొన్న భరద్వాజ్, మద్దతు పునాది, కేడర్, అగ్ర నాయకత్వానికి మధ్య ఉన్న భావోద్వేగ సంబంధం కూడా సంస్థను కలిసి ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. 'సునీతా కేజ్రీవాల్ ఉనికి సానుకూల ప్రభావాన్ని చూపింది' అని ఆయన అన్నారు. 'ఆమె అరవింద్ కేజ్రీవాల్ జీ సందేశాలను అందజేస్తున్నారు. ఇది మా పార్టీ క్యాడర్‌పై, సానుభూతిపరులపై గొప్ప ప్రభావాన్ని చూపింది. మేము దానిని ప్రచారం

- మిగతా 2 లో

రష్యా స్థావరంపై ఉక్రెయిన్ మెరుపుదాడి

ఆరు యుద్ధ విమానాలు ధ్వంసం

కీవ్: ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ సంస్థ ఎస్‌బీయూ, సైన్యం సంయుక్తంగా భారీ స్థాయిలో రష్యాపై దాడి చేశాయి. దక్షిణ రోస్టవ్‌లోని మోరోజోవ్స్క్ వైమానిక స్థావరంపై జరిగిన ఈ దాడిలో ఆరు విమానాలు పూర్తిగా ధ్వంసం కాగా... మరో ఎనిమిది వరకు తీవ్రంగా దెబ్బతిన్నాయని బారెన్స్ వార్తా సంస్థ పేర్కొంది. డజన్ల సంఖ్యలో డ్రోన్లను ఉపయోగించినట్లు తెలుస్తోంది. తాము 44 డ్రోన్లు కూల్చివేశామని రష్యా రక్షణశాఖ పేర్కొంది. ఓ పవర్ సబ్‌స్టేషన్ కూడా ఈ దాడిలో దెబ్బతిన్నట్లు సమాచారం. ఈ వైమానిక స్థావరంలో మొత్తం సు-24, సు-34, ఇతర టాక్టికల్ బాంబర్ విమానాలు ఉంచుతారు. దీనిని రష్యా పైలట్లకు శిక్షణ ఇచ్చేందుకు వినియోగిస్తారు. భద్రతా దళాలకు చెందిన దాదాపు 20 మంది సిబ్బంది ఈ దాడిలో మరణించి ఉంటారని కీవ్ ఇండిపెండెంట్ అంచనా వేస్తోంది. రష్యా వాయుసేన శక్తిని ఈ దాడి గణనీయంగా తగ్గిస్తుందని ఉక్రెయిన్ చెబుతోంది. మొత్తం 53 డ్రోన్లను ఏకకాలంలో ప్రయోగించినట్లు సమాచారం. ఈ ఎయిర్‌బేస్ వద్ద భారీగా పేలుళ్లు జరుగుతున్న వీడియో వైరల్‌గా మారింది. మరోవైపు బెల్గరోడ్, కరుస్క్ వద్ద కూడా ఉక్రెయిన్ డ్రోన్లు దాడులకు యత్నించాయి. దాదాపు ఏడాది నుంచి రష్యా భూభాగంపై కూడా ఉక్రెయిన్ విజయవంతంగా దాడులు చేస్తోంది. కొద్ది రోజుల క్రితం సెంట్రల్ టాటర్‌స్తాన్‌లోని ఓ భారీ చమురు కేంద్రం, డ్రోన్ల అసెంబ్లింగ్ యూనిట్లపై కీవ్ విరుచుకుపడింది. మరోవైపు క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ మాట్లాడుతూ నాటోతో సంబంధాలు బాగా దిగజారాయన్నారు. ఇవి ప్రత్యక్ష పోరు స్థాయికి చేరినట్లు అభివర్ణించారు. కొన్నాళ్ల నుంచి అమెరికా నేతృత్వంలోని ఈ సైనిక కూటమి ఇప్పటికే ఉక్రెయిన్‌తో యుద్ధంలో చేరిందన్నారు. ఇది రష్యా సరిహద్దుల్లోకి వస్తోందని వ్యాఖ్యానించారు. 100 బిలియన్ యూరోలు ఉక్రెయిన్‌లో పెట్టుబడి పెట్టాలని నాటో సెక్రటరీ జనరల్ జేన్స్ స్టోల్టెన్‌బర్గ్ వ్యాఖ్యల నేపథ్యంలో పెస్కోవ్ ఈవిధంగా స్పందించారు. ఇప్పటికే నాటో సభ్య దేశమైన ఫ్రాన్స్ ప్రత్యక్షంగా బలగాలను ఉక్రెయిన్‌కు పంపేందుకు సంసిద్ధత వ్యక్తంచేసింది.

భూకంపం నుంచి అతి పెద్దభవనాన్ని రక్షించిన స్టీల్‌బాల్ !



తైపీ: తైవాన్‌లో భారీ భూకంపం కారణంగా వందలాది భవనాలు దెబ్బతిన్నప్పటికీ ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ఆకాశహర్మ్యంగా చెప్పబడిన తైపీ-101కి మాత్రం ఏమీ కాకపోవడం విశేషం. ఆధునిక ఇంజినీరింగ్ సాధించిన అద్భుత విజయంగా అభివర్ణిస్తున్న ఈ భారీ నిర్మాణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వ్యవస్థే అందుకు కారణం. కొద్ది రోజుల క్రితం భూకంపం సంభవించినప్పుడు 1,667 అడుగుల తైపీ-101 కొద్దిగా ఊగినట్లు వీడియో ఫుటేజీల్లో కనిపిస్తోంది. కానీ, భారీ కుదుపులకు మాత్రం లోనుకాలేదు. 101 అంతస్తుల ఈ భవనం పై భాగంలో ఏర్పాటుచేసిన గోళం లాంటి వస్తువే అందుకు కారణం. దీన్నే ఇంజినీరింగ్ పరిభాషలో 'ట్యూన్డ్ మాస్ డ్యాంపెనర్'గా వ్యవహరిస్తారు. 87 నుంచి 92 అంతస్తుల మధ్య ఈ భారీ గోళాన్ని 92 మందమైన కేబుల్స్‌తో బిగించారు. దీని బరువు 660 టన్నులు. మొత్తం 41 భారీ ఉక్కు షీట్లతో నిర్మించారు. దీని వ్యాసం 18 అడుగులు. ఇది ఏ దిశలోనైనా దాదాపు 5 అడుగుల వరకు కదులుతుంది. ఫలితంగా, భారీ ప్రకంపనల వల్ల వచ్చే కుదుపులను ప్రతిఘటించే లేదా తగ్గించే లోలకంలా పని చేస్తుంది. 'భవనం ఊగినప్పుడు ట్యూన్డ్ మాస్ డ్యాంపెనర్లు వ్యతిరేక దిశలో కదులుతాయి. తైపీ-101లో ఈ గోళం వేలాడుతూ ఉంటుంది. అకస్మాత్తుగా టవర్‌లో కుదుపులు వచ్చినప్పుడు అది వ్యతిరేక దిశలో ఊగుతుంది. తద్వారా గతిశక్తిని గ్రహిస్తుంది. గోళానికి, టవర్‌కు మధ్య ఉన్న హైడ్రాలిక్ సిలిండర్లు ఆ శక్తిని ఉష్ణంగా మార్చి చెదరగొడతాయి' అని 'సూపర్‌టాల్: హౌ ద వరల్డ్స్ టాలెస్ట్ బిల్డింగ్స్ ఆర్ రీషేపింగ్ అవర్ సిటీస్ అండ్ లైవ్స్' పుస్తక రచయిత స్టీఫెన్ వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా భారీ భవన సముదాయాల్లో ఇలాంటి ట్యూన్డ్ మాస్ డ్యాంపెనర్లను వాడుతున్నట్లు స్టీఫెన్ పేర్కొన్నారు. భూకంపాల సమయంలో వచ్చే ప్రమాదకర కుదుపుల వల్ల కలిగే 'హార్మోనిక్ వైబ్రేషన్స్' కారణంగా భవనాలు కుప్పకూలుతాయని తెలిపారు. వాటి నుంచి రక్షించేందుకే ఈ డ్యాంపెనర్లను ఏర్పాటుచేస్తారని వివరించారు. భారీ గాలులు వీచే సమయంలో భవనంలో ఉండేవారికి కలిగే అసౌకర్యం నుంచి కూడా ఇది రక్షణ కల్పిస్తుందని చెప్పారు.

హమాస్‌పై పోరులో ఏఐ టూల్ వినియోగం

జెరూసలెం: ఇజ్రాయెల్-హమాస్ మధ్య కొద్ది నెలలుగా యుద్ధం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ప్రపంచ దేశాలు యుద్ధాన్ని ఆపేందుకు చేస్తున్న ప్రయత్నాలేవీ ఫలించడం లేదు. తాజాగా దిగ్భ్రాంతి గొలిపే విషయం వెలుగులోకి వచ్చింది. హమాస్ లక్ష్యంగా దాడులు చేసేందుకు ఇజ్రాయిల్ ఆర్మీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయం తీసుకుంటోందని ఓ నివేదిక వెల్లడించింది. ఈ ఏఐ ఆధారిత టూల్‌ని 'లావెండర్' పేరుతో పిలుస్తారు. ఏఐ టూల్‌తో పదిశాతం తప్పు జరిగిందని నివేదిక పేర్కొంది. దీనిపై ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్)ను సంప్రదించగా ఏఐ టూల్ ఉనికిని తోసిపుచ్చలేదు. అయితే, అనుమానిత ఉగ్రవాదులను గుర్తించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగిస్తున్నట్లు పేర్కొంది. టూల్ రబ్బర్ స్టాంప్‌లా పని చేసిందని ఓ అధికారి పేర్కొన్నారు. టూల్ ఎవరైనా వ్యక్తిని గుర్తిస్తే 20 సెకన్లలో దాడి చేస్తుందని సమాచారం. ఈ టూల్ ఉగ్రవాదులను గుర్తించే ప్రక్రియలో సమాచార వ్యవస్థ మాత్రమేనని ఆర్మీ ఒక ప్రకటనలో పేర్కొంది. గాజాపై ఇజ్రాయిల్ సైనిక చర్యపై అంతర్జాతీయంగా విమర్శలు వెల్లువెత్తుతున్న తరుణంలో ఈ నివేదిక వెలుగులోకి వచ్చింది. ఇటీవల ఇజ్రాయిల్ జరిపిన లక్షిత వైమానిక దాడుల్లో పలస్తీనియన్లకు ఆహారాన్ని సరఫరా చేస్తున్న అనేక విదేశీ సహాయ కార్యకర్తలపై దాడి చేసి చంపినట్లు ఆరోపణలున్నాయి. గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించిన సమాచారం ప్రకారం యుద్ధంలో గాజాలో ఇప్పటివరకు 32,916 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. యుద్ధం కారణంగా ఉత్తర గాజా ప్రాంతంలో నాలిగింట మూడొంతుల మంది ఆకలితో అలమటిస్తున్నారని ఐరాస నివేదిక వెల్లడించింది.

నెల్లూరులో నెట్టుకొచ్చేదెలా?

(మొదటిపేజీ తరువాయి)

మార్పులు, చేర్పులపై ముఖ్యనేతలతో సీఎం జగన్ సమీక్షలకే పరిమితమయ్యారు. సిద్ధం సభలు జరిగిన జిల్లాలను మినహాయించి, మిగిలిన అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల్లోను బస్సు యాత్రలు కొనసాగేలా షెడ్యూలు రూపొందించారు. ఇందులోభాగంగా రోడ్‌షోలు, ప్రతిరోజు ఒక బహిరంగ సభ సీఎం జగన్ నిర్వహిస్తున్నారు. బస్సు యాత్రలు ముగిశాక మరో 100 నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచార సభలకు సీఎం జగన్ సిద్ధమయ్యారు. ప్రతిరోజూ హెలికాప్టర్ ద్వారా మూడు ప్రాంతాల్లోని (రాయలసీమ, మధ్య ఆంధ్ర, ఉత్తరాంధ్ర) ప్రాంతాలను కవర్‌చేస్తూ, మూడు నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహిస్తారు. ఆయా నియోజకవర్గాల్లో బహిరంగ సభలతోపాటు రోడ్‌షోలు ఉంటాయి. ఈ విడత సిద్ధం సభలతోపాటు మేమంతా సిద్ధం బస్సు యాత్రలో కవర్‌కాని నియోజకవర్గాలకు అధిక ప్రాధాన్యతనిస్తారు. అవసరమైతే ఒక్కో నియోజకవర్గానికి రెండు సార్లు వెళ్లే అవకాశాలున్నాయి. ఆ దిశగా వైసీపీ అధిష్ఠానం ప్రణాళిక రూపొందిస్తోంది. బస్సు యాత్రలో భాగంగానే మేనిఫెస్టో అంశాలపైనా జగన్ నిపుణులతో చర్చిస్తున్నారు. శనివారం నుంచి తొమ్మిదో రోజు సీఎం జగన్ బస్సు యాత్ర కొనసాగిస్తారు.

అవినాశ్‌రెడ్డిని ఓడిద్దాం

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వడమే కాకుండా కాపాడుతున్నారని మండిపడ్డారు. ఇది దురదృష్టం, దుర్మార్గం, అన్యాయమన్నారు. హంతకులు చట్ట సభలోకి వెళ్లకూడదన్నదే తమ అభిమతమన్నారు. న్యాయం ఒక వైపు, అధికారం ఒక వైపు... అధర్మం వైపు నిలబడ్డ అవినాశ్‌రెడ్డి కావాలా, న్యాయం వైపు నిలబడ్డ షర్మిల కావాలా అంటూ ప్రశ్నించారు. ప్రజలే నిర్ణయించాలని అన్నారు. హత్యా రాజకీయాలు చేసే అవినాశ్ రెడ్డిని, కాపాడే జగన్‌ను ఇద్దరినీ ఓడించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, కడప స్టీల్ ఫ్యాక్టరీ శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు. బీజేపీకి జగన్ ఓ బానిసలా మారారన్నారు. బద్వేల్ అసెంబ్లీ నుంచి కాంగ్రెస్ అభ్యర్థినిగా పోటీ చేస్తున్న విజయజ్యోతిని భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.

మాజీ మంత్రి వివేకా కుమార్తె సునీతారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ అంటే వైఎస్ షర్మిల అని, ఆమెను దీవించాలన్నారు. తమ తండ్రి వివేకాను చంపిన వాళ్లకు, షర్మిలకు మధ్య పోటీ జరుగుతోందన్నారు. షర్మిలను ఎంపీ చేయాలన్న నాన్న కోరికను నెరవేర్చాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అవినాశ్‌రెడ్డి గెలువకూడదన్నారు. కిల్లి కృపారాణి మాట్లాడుతూ జగన్ కోసం ఎంతో కష్టపడి ఉత్తరాంధ్రలో పార్టీని నిలబెట్టానని అటువంటి తనను జగన్ పక్కన పెట్టారన్నారు. పార్టీ కోసం ఎంతో కష్టపడ్డ నాకు గుర్తింపు లేదన్నారు. జగన్ ఓ నియంత... అతడిని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

మదర్సా విద్యార్థులకు ఊరట

(మొదటిపేజీ తరువాయి)

బోధిస్తున్నారని సూచించింది. హైకోర్టు నిర్ణయం ప్రాథమికంగా సరికాదని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీనిపై వివరణ ఇవ్వాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. మదర్సా బోర్డ్, కేంద్రానికి, యూపీ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. ఈ అంశంపై లేవనెత్తిన సమస్యలను మరింత నిశితంగా పరిశీలించాల్సి ఉందని సీజేఐ చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. తదుపరి విచారణను జులై రెండో వారానికి వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. మదర్సా చట్టం 2004 లౌకికవాదాన్ని ఉల్లంఘిస్తుందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని గత నెలలో అలహాబాద్ హైకోర్టు ప్రకటించింది. మదర్సా విద్యార్థులకు అధికారిక విద్యావిధానంలో వసతి కల్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. మదర్సా బోర్డ్ లక్ష్యం, ఉద్దేశం నియంత్రణ స్వభావాన్ని కలిగి ఉన్నప్పటికీ సెక్యులరిజాన్ని ప్రభావితం చేయదంటూ సుప్రీంకోర్టు ఆ ఆదేశాలను నిలిపివేసింది. హైకోర్టు తీర్పుని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో సమర్థించాయి. మతం, ఇతర అనుమానిత అంశాలపై చర్చ జరగాలని పట్టుబట్టాయి. మతపరమైన విద్య అంటే మతానికి సంబంధించిన అంశాల బోధన కాదని మదర్సాల తరపున హాజరైన అభిషేక్ మను సింఘ్వీ కోర్టులో వాదించారు. హైకోర్టు ఆదేశాలతో విద్యార్థులతో పాటు 10 వేల మంది మదర్సా టీచర్ల భవిష్యత్తు దిక్కుతోచని స్థితిలో పడిందని పేర్కొన్నారు.

పార్టీ ఐక్యతకు సునీత బెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

చేయాలనుకుంటున్నాము. ప్రస్తుత పరిస్థితుల్లో, పార్టీని కలిసి ఉంచడానికి ఆమె ఉత్తమ వ్యక్తి' అని భరద్వాజ్ అన్నారు. దిల్లీ ప్రభుత్వం ఇప్పుడు రద్దు చేసిన మద్యం పాలసీకి సంబంధించి మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేసిన అరవింద్ కేజ్రీవాల్‌కు న్యాయస్థానం ఏప్రిల్ 15 వరకు జ్యూడీషియల్ కస్టడీ విధించింది. కాగా, ఈడీ కస్టడీ, తీహార్ జైలులో ఉన్న అరవింద్ కేజ్రీవాల్ సందేశాలను ఆయన భార్య సునీత ఇప్పటి వరకు మూడు డిజిటల్ ప్రసంగాలను అందించారు. అందులో రాజకీయ అంశానికి సంబంధించి ఆమె మార్చి 31న 'ఇండియా' కూటమి సభలో కేజ్రీవాల్ సందేశాన్ని చదివి వినిపించారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి సునీతా కేజ్రీవాల్ ప్రచారం చేస్తారా అడిగిన ప్రశ్నకు, 'అదే జరిగే మాకు సంతోషం. సునీతా జీ ప్రచారంలో పాల్గొనేది ఆమె వ్యక్తిగత నిర్ణయం' అని తెలిపారు. ఇదిలాఉండగా, మద్యం పాలసీ కేసులో అరెస్టయి బుధవారం బెయిల్ పొందిన ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ కూడా జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే సునీతా కేజ్రీవాల్‌ను కలుసుకుని ఆమెకు పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి భరద్వాజ్ మాట్లాడుతూ ఎవరైనా అన్నయ్య కష్టాల్లో ఉంటే తన కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత అతనికి ఉందని తెలిపారు. 'ఇది మన సంస్కృతి. కేజ్రీవాల్ అరెస్టు తర్వాత పార్టీ సభ్యుల మధ్య గొడవలు జరుగుతాయని బీజేపీ చెబుతోంది. సంజయ్ సింగ్ అరవింద్ కేజ్రీవాల్‌ను తన కుటుంబంగా, అతని అన్నయ్యగా భావిస్తాడు. అందుకే అతను ఆమె (సునీతా కేజ్రీవాల్) పాదాలకు నమస్కరించాడు. మేము ఒక కుటుంబంగా, యూనిట్‌గా పని చేస్తున్నాము' అని అన్నారు.

భూకుంభకోణంలో సోరెన్ భాగస్వామి

ఈడీ చార్జిషీటు వెల్లడి

న్యూఢిల్లీ: భూ కుంభకోణం కేసులో జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శుక్రవారం చార్జిషీటు దాఖలు చేసింది. సోరెన్ రూ.600 కోట్ల మేర అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు చార్జిషీటులో పేర్కొంది. ల్యాండ్ మాఫియాలో సోరెన్ భాగమని, మాఫియాలో వచ్చిన అక్రమ ఆదాయాన్ని ఆయన కలిగి ఉన్నారని ఆరోపించింది. హేమంత్ సోరెన్‌కు చెందిన 8.86 ఎకరాల భూమికి సంబంధించి కీలక సమాచారంలో 44 పేజీల ఫైల్‌ను విచారణ సమయంలో ప్రతాప్ కార్యాలయంలో గుర్తించామని తెలిపింది. సోరెన్‌ను ప్రతాప్ బాస్ అని పిలిచేవారని చార్జిషీట్ పేర్కొంది. రాంచీలోని బార్గెన్ ప్రాంతంలో సోరెన్‌కు 8.86 ఎకరకాల అక్రమ భూమి, బీఎండబ్ల్యూ కారు ఉన్నాయని వెల్లడించింది. సోరెన్‌తో పాటు రెవెన్యూ అధికారి భాను ప్రతాప్ ప్రసాద్, మరో ఇద్దరు ఉద్యోగులు నిందితులని తెలిపింది. హేమంత్ సోరెన్ సన్నిహితులు రంజిత్ సింగ్, హిలేరియస్ కచాప్, రాజ్‌కుమార్ సాయంతో ఈ భూమిని ఆక్రమించారని ఆరోపించింది. భానుప్రతాప్ సహా కొంతమంది అధికారుల సాయంతో భూ కబ్జాను సులభతరం చేశారని, భూమి పత్రాలు మార్చారని తెలిపింది. మినిస్టర్ జి పేరు కింద సంతోశ్ ముండా ఈ ఆస్తికి సంరక్షకుడిగా ఉన్నట్లు ధృవీకరించారని పేర్కొంది. 2011 నుండి ఈ భూమిపై సోరెన్ హక్కులు కలిగి ఉన్నారని, ప్రస్తుతం ఆ ఆస్తి విలువ రూ. 31 కోట్లు ఉంటుందని తెలిపింది. అయితే విచారణ సమయంలో ఆ ఆస్తిని ఈడీ జప్తు చేసింది. అలాగే సోరెన్ నివాసం నుండి రూ.36 లక్షల నగదు, బీఎండబ్ల్యూ కారును స్వాధీనం చేసుకుంది. సిండికేట్‌లో అక్రమంగా స్వాధీనం చేసుకున్న రూ.256 కోట్ల విలువైన ఆస్తులు జప్తు చేసినట్లు ఈడీ తెలిపింది. 33 మంది సాక్షుల వాంగ్మూలాలు సేకరించామని, వేలాది పేజీల పత్రాలు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించింది. హేమంత్ సోరెన్, రాంచీ మాజీ డీసీ, ఐఏఎస్ అధికారి చవి రంజన్ సహా 16 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపింది.

వృద్ధి అంచనా మాది కాదు: ఐఎంఎఫ్

వాషింగ్టన్: భారత వృద్ధి అంచనాలపై అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణమూర్తి సుబ్రమణియన్ చేసిన వ్యాఖ్యలపై ఆ సంస్థ స్పందించింది. వృద్ధి అంచనాలు ఆయన వ్యక్తిగతమని, వాటితో తమకు ఏమాత్రం సంబంధం లేదని తెలిపింది. ఐఎంఎఫ్ వెలువరించిన అంచనాలకు భిన్నంగా భారత్ ఎనిమిది శాతం వృద్ధి సాధిస్తుందన్న సుబ్రమణియన్ వ్యాఖ్యలపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఐఎంఎఫ్ అధికార ప్రతినిధి జూలీ కొజాక్ ఈ మేరకు సమాధానం ఇచ్చారు. ఆ అంచనాలతో తమకు సంబంధం లేదన్నారు. ఇటీవల దిల్లీలో జరిగిన కార్యక్రమంలో సుబ్రమణియన్ పాల్గొన్నారు. ఈసందర్భంగా భారత ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడారు. గత 10 ఏళ్లుగా అవలంభించిన విధానాలు రెట్టింపు చేసి, సంస్కరణలను వేగవంతం చేస్తే 2047 వరకు భారత్ ఎనిమిది శాతం వృద్ధితో దూసుకెళ్లగలదని అభిప్రాయపడ్డారు. అయితే, ఈ ఏడాది జనవరిలో భారత వృద్ధి అంచానాలను 6.5 శాతంగా ఐఎంఎఫ్ పేర్కొంది. సుబ్రమణియన్ అంచనాలు అందుకు భిన్నంగా ఉండడంపై మీడియా ప్రతినిధులు ఐఎంఎఫ్ ప్రతినిధిని ప్రశ్నించారు. దీనిపై కొజాక్ మాట్లాడుతూ వివిధ దేశాల ప్రతినిధులతో కూడిన ఎగ్జిక్యూటివ్ బోర్డు ఐఎంఎఫ్‌లో ఉంటుందని, తమ సిబ్బందితో పోలిస్తే వారి అభిప్రాయాలు భిన్నంగా ఉండొచ్చని కొజాక్ పేర్కొన్నారు. మరికొన్ని వారాల్లో భారత వృద్ధి అంచనాలను వెలువరిస్తామని తెలిపారు.

ఇది మరో స్వాతంత్ర్య సంగ్రామం: కనిమొళి

చెన్నై: కేంద్రంలోని బీజేపీ పాలకులు తెల్లదొరల్లా విభజించు-పాలించు విధానాన్ని అమలు చేసి దేశాన్ని ముక్కలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ప్రస్తుతం జరుగుతున్నవి లోక్‌సభ ఎన్నికలు కావని, మరో స్వాతంత్ర్య సంగ్రామమని డీఎంకే ఎంపీ కనిమొళి అన్నారు. మదురైలో సీపీఎం అభ్యర్థి వెంకటేశన్‌కు మద్దతుగా ఆమె ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదేళ్లుగా తమిళ ప్రజల బాగోగులు ఏమాత్రం పట్టించుకోకుండా, రాష్ట్రానికి అవసరమైన నిధులు విడుదల చేయకుండా బీజేపీ ప్రభుత్వం నిరంకుశత్వం ప్రదర్శించిందని విమర్శించారు. మదురైకి అంతర్జాతీయ విమానాశ్రయం కావాలని అడిగితే ససేమిరా అని చెప్పిన ప్రధాని మోదీ...ఎవరూ అడగకుండానే అయోధ్యలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు చేశారన్నారు. పదేళ్లుగా కార్పొరేట్ సంస్థలకు అండగా ఉంటూ రూ.65 వేల కోట్ల మేరకు రుణాలు మాఫీ చేశారని ఆరోపించారు.

అది భారత వ్యతిరేక ప్రచారం

బ్రిటన్ పత్రిక కథనంపై విదేశాంగశాఖ ఆగ్రహం

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌లో ఉగ్రవాదుల మిస్టరీ మరణాల వెనుక భారత్ హస్తం ఉందన్న బ్రిటన్ పత్రిక కథనంపై మన విదేశాంగశాఖ మండిపడింది. అది పూర్తిగా తప్పుడు సమాచారమని, భారత వ్యతిరేక ప్రచారమని పేర్కొంది. ఇతర దేశాల్లో లక్షిత హత్యలు భారత్ ప్రభుత్వ విధానం కాదని పునరుద్ఘాటించింది. గతంలోనూ ఈ విషయంపై మన విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్ జైశంకర్ దేశ వైఖరిని స్పష్టం చేసిన విషయం తెలిసిందే. బ్రిటన్‌కు చెందిన 'ది గార్డియన్' పత్రిక భారత్‌పై ఇటీవల తీవ్ర ఆరోపణలు చేసింది. 2019లో పుల్వామా ఘటన తర్వాత నుంచి దేశానికి ప్రమాదకరంగా మారుతున్న వ్యక్తులను న్యూదిల్లీ లక్ష్యంగా చేసుకొందని పేర్కొంది. భారత విదేశీ ఇంటెలిజెన్స్ సంస్థ 'రా' దాదాపు 20 హత్యలు చేసి ఉంటుందని ఆరోపించింది. భారత్, పాక్ ఇంటెలిజెన్స్ అధికారులు ఇచ్చిన సమాచారం ఆధారంగానే కథనం రాసినట్లు పేర్కొంది. న్యూదిల్లీ కౌంటర్ ఇంటెలిజెన్స్ వ్యూహంలో భాగంగా యూఏఈలో స్లీపర్ సెల్స్‌ను ఏర్పాటు చేసుకుందని తెలిపింది. వారే ఈ హత్యలకు పథక రచన చేస్తున్నారని పాక్ అధికారులు చెబుతున్నట్లు ఆ పత్రిక పేర్కొంది. వారే పాక్‌లోని స్థానిక నేరగాళ్లకు, పేదలకు లక్షల రూపాయలు చెల్లించి ఈ టార్గెట్ కిల్లింగ్స్‌ను అమలు చేస్తున్నారని రాసుకొచ్చింది. లష్కరే, జైషే ఉగ్ర సంస్థలకు చెందిన షాహిద్ లతీఫ్, రియాజ్ అహ్మద్ హత్యల్లో భారత్ హస్తం ఉందంటూ ఇస్లామాబాద్ జనవరిలో ఆరోపించిన విషయం తెలిసిందే. ఇజ్రాయిల్‌కు చెందిన మొస్సాద్, రష్యాకు చెందిన కేజీబీ నుంచి భారత్ స్ఫూర్తి పొంది ఈ చర్యలకు దిగినట్లు ఆ పత్రిక వెల్లడించింది.

ఒడిశా స్కూళ్లలో వాటర్‌బెల్

భువనేశ్వర్: కేరళ, ఆంధ్రప్రదేశ్ తరహాలోనే ఒడిశా ప్రభుత్వం కూడా పాఠశా లల్లో 'వాటర్ బెల్' మోగించాలని నిర్ణయించింది. ఎండ తీవ్రత అధికమవుతోన్న వేళ విద్యార్థులు, ఉపాధ్యాయులకు హైడ్రేషన్ బ్రేక్ ఇవ్వాలని తాజాగా ఒడిశా విద్యాశాఖ నిర్ణయిం చింది. కమిషనర్ కమ్ సెక్రటరీ అశ్వతి జిల్లాస్థాయి అధికారులకు ఇచ్చిన ఆదేశాల ప్రకారం పాఠశాల సమయంలో మూడుసార్లు 'వాటర్ బెల్స్' మోగించాలని, విద్యార్థులు, ఉపాధ్యాయులను నీరు తాగాలని సూచించారు. ఈ ఆదేశాల ప్రకారం ప్రతి రోజూ ఉదయం 8.30, 10, 11 గంటలకు 'వాటర్ బెల్' మోగిస్తారు. ఎండ తీవ్రత పెరుగుతోన్న క్రమంలో విద్యార్థులకు నీటి సౌకర్యం కల్పించాలని ఉపాధ్యాయులకు తెలిపారు. ఒడిశాలో ఏప్రిల్ 2 నుంచి ఒక్క పూట బడులు కొనసాగుతున్నాయి. ఉదయం 7 నుంచి 11:30 వరకు తరగతులు నిర్వహిస్తున్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఎలా?

(మొదటిపేజీ తరువాయి)

పరిశ్రమలో పనిచేసే ఉద్యోగులు, భూములిచ్చిన భాగస్వాములు, రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించారా ? అని ప్రశ్నించింది. ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకుని, ప్రత్యామ్నాయ మార్గాన్ని ఆలోచించాలని, అందుకు మార్గాలున్నాయంటూ ఏపీ ముఖ్యమంత్రి రాసిన లేఖపై ఏం నిర్ణయం తీసుకున్నారో చెప్పాలంటూ నిలదీసింది. ఆ లేఖపై స్పందించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి ఉంది కదా ? అని పేర్కొంది. అలాగే పరిశ్రమ నిర్వహణకు అవసరమైన నిధులు సమీకరించేందుకు, ఫెరా చట్టం కింద ప్రత్యేక బ్యాంక్ ఖాతా తెరిచేందుకు అనుమతించాలని కోరుతూ పిటిషనర్ కేఏ పాల్ ఇచ్చిన విజ్ఞాపనపై ఏం చర్యలు తీసుకున్నారో కూడా చెప్పాలని ఆదేశించింది. విశాఖ ఉక్కు పరిశ్రమకు చెందిన భూముల విక్రయం, ప్రైవేటీకరణకు సంబంధించిన సమగ్ర వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. ఇప్పటివరకు సొంత నిధులతో కొనుగోలు చేసిన 25 ఎకరాల భూమిని మాత్రమే విక్రయించామని, పరిశ్రమ కోసం సేకరించిన భూములను అమ్మలేదని విశాఖ ఉక్కు కర్మాగారం తరపు న్యాయవాది కోర్టుకు తెలియజేశారు. అనంతరం జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ ఎన్.విజయ్‌తో కూడిన ధర్మాసనం దీనిపై తదుపరి విచారణను ఈనెల 24వ తేదీకి వాయిదా వేసింది.

ఉద్యోగాలు, సంపద, సంక్షేమం

(మొదటిపేజీ తరువాయి)

పోరాడి మోదీని గద్దె దించాలి. కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి పార్టీ హామీలును వారికి చెప్పాలి. అవినీతిపరులను పార్టీలో చేర్చుకొని బీజేపీ మమ్మల్ని నిందిస్తోంది. ప్రధాని ఇప్పటి వరకు భయపడి మణిపూర్ వెళ్లలేదు, మా నేత రాహుల్ అక్కడికి వెళ్లారు. భయపడే నాయకుడు దేశానికి మంచి చేయలేరు" అని ఖర్గే అన్నారు.

23 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి: చిదంబరం

తమ పార్టీ వర్కింగ్ కమిటీలో పూర్తిస్థాయిలో చర్చలు జరిపి ఈ మేనిఫెస్టోను తయారు చేసినట్లు మేనిఫెస్టో కమిటీ చైర్మన్, ఆర్థికశాఖ మాజీ మంత్రి పీ చిదంబరం వెల్లడించారు. గత పదేళ్లలో అన్ని రకాల న్యాయాలు ప్రజలకు అందలేదని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ సంస్థలను పనిచేయనీయకపోవడం, బలహీన వర్గాల అణచివేత కొనసాగుతోందన్న చిదంబరం... పార్లమెంట్ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేశారని విమర్శలు గుప్పించారు. గత పదేళ్లలో దేశానికి జరిగిన నష్టాన్ని పూడ్చేలా ఈ న్యాయపత్రను సిద్ధం చేసినట్లు చెప్పారు. 'వర్క్, వెల్త్, వెల్ఫేర్' (ఉద్యోగాలు, సంపద, సంక్షేమం)ను ప్రజలకు అందిస్తామని హామీ ఇచ్చారు. యూపీఏ-1 పాలనలో 8.5 శాతం వృద్ధి సాధించామని గుర్తు చేశారు. గత పదేళ్లలో దేశం 5.9 శాతం మాత్రమే వృద్ధి సాధించిందని చెప్పారు. యూపీఏ ప్రభుత్వం 24 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చిందని, 2024లో అధికారం చేపట్టాక మరో 23 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి కల్పిస్తామని చిదంబరం వివరించారు.

కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో ముఖ్యాంశాలు

- 50శాతం రిజర్వేషన్ పరిమితి పెంపు
- దేశవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, కుల గణన నిర్వహణ
- ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు 50శాతం ఇస్తున్న రిజర్వేషన్ పరిమితి పెంచడం కోసం రాజ్యాంగ సవరణ.
- ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో పది శాతం ఈడబ్ల్యూఎస్ కోటా అన్ని కులాలు, వర్గాలకు వివక్ష లేకుండా అందగజేత
- ప్రజలందరి ఆరోగ్య సంరక్షణ కోసం రూ.25 లక్షల వరకు నగదు రహిత బీమా
- పేద మహిళలకు ఏడాదికి రూ.లక్ష ఆర్థిక సాయం
- కిసాన్ న్యాయ్ పేరుతో రైతులకు భరోసా
- కనీస మద్దతు ధర భరోసా కల్పిస్తూ చట్టం
- విద్యార్థులకు రూ.లక్ష ఆర్థిక సాయం
- వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వం నుంచి సామాజిక న్యాయం కింద ఆర్థిక సాయం నెలకు రూ.200-500 నుంచి రూ.1000కి పెంపు
- సీనియర్ సిటిజన్లకు సంబంధించి ఒంటరిగా విడిచిపెట్టడం, ఆర్థిక మోసం వంటి సందర్భాల్లో న్యాయ సేవలను సులభంగా పొందేలా చర్యలు
- దివ్యాంగుల హక్కుల చట్టం-2016ను కఠినంగా అమలు
- ఎల్జీబీటీక్యూఐఏ+ వర్గానికి చెందిన జంటలను గుర్తించడానికి కొత్త చట్టం
- బ్రెయిలీ లిపి, సంకేత భాషను భాషలుగా గుర్తింపు
- రైతులను ఆదుకునేందుకు రుణమాఫీ
- ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వ్ చేసిన పోస్టులను ఏడాదిలో భర్తీ
- ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల స్కాలర్‌షిప్ రెట్టింపు
- ప్రతి జిల్లాలో లైబ్రరీలతో కూడిన అంబేద్కర్ భవనాలు
- వైద్యులు, వైద్యసిబ్బందిపై దాడికి పాల్పడితే కఠిన చర్యలకు చట్టం
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్
- ఉపాధి హామీ పథకం కూలీ రోజుకు రూ.400కు పెంపు
- అగ్నిపథ్ పథకం రద్దు, జమ్మూకశ్మీర్‌కు పూర్తి స్థాయి రాష్ట్ర హోదా పునరుద్ధరణ
- ప్రభుత్వ ఉద్యోగాల పరీక్ష ఫీజుల రద్దు
- మార్చి 15 నాటికి ఉన్న విద్యా రుణాల మొత్తం రద్దు. ఆ సొమ్మును ప్రభుత్వమే బ్యాంకులకు చెల్లించేలా చర్యలు.
- మైనార్టీలకు వస్త్రధారణ, ఆహారం, భాష, పర్సనల్ లాను ఎంచుకొనే హక్కు
- తప్పుడు వార్తల నియంత్రణకు 1978 నాటి ప్రెస్ కౌన్సిల్ ఇండియా చట్టానికి సవరణ.

ఎవరైనా నేరుగా ఫిర్యాదు చేయొచ్చు

(మొదటిపేజీ తరువాయి)

శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజకీయ పార్టీలు, సంఘాలు లేదా ఏ వ్యక్తి అయినా ఎన్నికలకు సంబంధించిన విషయాలపై ఫిర్యాదులు/ విజ్ఞాపనలు సమర్పించాల నుకుంటే నిర్దిష్ట సమయాల్లో రాష్ట్ర సచివాలయంలో తమను నేరుగా కలిసి అందజేయ వచ్చునని సూచించారు. కార్యాలయ పని దినాలతో పాటు ప్రభుత్వ సెలవు దినాల్లో కూడా తాము అందుబాటులో ఉంటే స్వీకరిస్తామన్నారు. సమావేశాలు, ఇతర కారణాల వల్ల తాను కార్యాలయంలో అందుబాటు లేని పక్షంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారులకు లేదా సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదులు, విజ్ఞాపనలను అందజేయాలని సూచించారు. సెలవు దినాల్లో ఫిర్యాదులు స్వీకరించే సదుపాయం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయ గ్రౌండ్ ఫ్లోర్ రూమ్ నెం.129లో ఫిర్యాదు సెల్‌లో అందుబాటులో ఉంటుందన్నారు.

'ఇండియా' అభ్యర్థులను గెలిపిద్దాం

గుంటూరు ఎంపీ సీటు జంగాలకే: ముప్పాళ్ల

విశాలాంధ్ర-గుంటూరు: ఇండియా కూటమి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా జంగాల అజయ్‌కుమార్ పేరును ప్రతిపాదించినట్లు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న జంగాల అజయ్‌కుమార్‌ను పార్లమెంట్ అభ్యర్థిగా బలపరుస్తూ గుంటూరు జిల్లా కార్యవర్గం, రాష్ట్ర కార్యవర్గం ఏకాభిప్రాయంతో జాతీయ పార్టీకి సిఫార్సు చేసినట్లు ముప్పాళ్ల చెప్పారు. గుంటూరు మల్లయ్య లింగంభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముప్పాళ్ల మాట్లాడారు. సీపీఐ, కాంగ్రెస్, సీపీఎం, ఆమ్ ఆద్మీ, ఇతర పార్టీలు రాష్ట్రంలో ఇండియా కూటమిగా బరిలో దిగుతున్నాయని ముప్పాళ్ల అన్నారు. ఒప్పందంలో భాగంగా రాష్ట్రంలో గుంటూరు పార్లమెంట్ స్థానంతో పాటు విశాఖపట్నం పశ్చిమ, ఏలూరు, విజయవాడ పశ్చిమ, అనంతపురం, పత్తికొండ, తిరుపతి, రాజంపేట, కమలాపురం వంటి 8 శాసనసభ స్థానాలలో సీపీఐ పోటీ చేయనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రకటించారన్నారు. సుదీర్ఘకాలం తరువాత సీపీఐకి గుంటూరు లోక్‌సభ స్థానంలో పోటీ చేసే అవకాశం వచ్చిందని గుర్తుచేశారు. వ్యవసాయ జిల్లాగా గుంటూరు పేరుగడించిందని, ఆసియాలోనే అతి పెద్ద వ్యవసాయ మార్కెట్, ప్రపంచంలో పేరు ప్రఖ్యాతులు గల పసుపు మార్కెట్ గుంటూరు పార్లమెంట్ పరిధిలోనే ఉన్నాయన్నారు. కార్మిక, కర్షక, మేధావుల, విద్యార్థి, యువజన ఉద్యమాలకు ఆది నుంచి గుంటూరు కీలక స్థానంగా నిలిచిందన్నారు. గుంటూరు పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు నియోజకవర్గాలలో సీపీఐ తన రాజకీయ పంథాను ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో పాటు ఇండియా కూటమి గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగ విలువలను మంటగలుపుతున్న బీజేపీ పాలన నుంచి దేశాన్ని విముక్తి గావించాల్సిన అవసరం ఉందన్నారు. మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ పెద్దలు అన్నట్లు ఈ దేశానికి ఇవే చివరి ఎన్నికలు అవుతాయని, ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్షాలను తన గుప్పెట్లో పెట్టుకున్న బీజేపీ... ఐదు కోట్ల ఆంధ్రులతో వికృత క్రీడ ఆడటానికి తెరతీసిందని విమర్శించారు. వైసీపీ, టీడీపీ, జనసేనలు బీజేపీ కబంధ హస్తాలలో ఉన్నాయని, ఏపీలో ఎవరు గెలిచినా 25 ఎంపీ సీట్లు తమవేనంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించడమే అందుకు ఉదాహరణ అన్నారు. గుంటూరు పార్లమెంట్ ప్రజలు చైతన్యవంతులని, తమ ఓటుతో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. విద్యార్థి దశ నుంచి ఇప్పటివరకు అనేక ఉద్యమాలు నిర్వహించి ప్రజల పక్షాన నిలబడిన ఇండియా కూటమి ఎంపీ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్‌కు ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఓటు అడిగే నైతిక హక్కు తమ పార్టీకే ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మూడు రాజధానుల పల్లవి అందుకున్నప్పుడు పోలీసు లాఠీలకు బెదరకుండా... పోలీస్‌స్టేషన్‌లు చూసి ఆదరకుండా... రాష్ట్రానికి ఒకే రాజధాని కావాలంటూ సీపీఐ పోరాడిందని గుర్తుచేశారు. భవన నిర్మాణ కార్మికులు, ఇతర రంగాల కార్మికుల సొమ్మును జగన్ దారిమళ్లిస్తుంటే పోరాడామన్నారు. ప్రభుత్వ ఆస్తులను అమ్మకానికి పెడితే ముఖ్యంగా గుంటూరు నగరంలోని పీవీకే కూరగాయాల మార్కెట్ అమ్మే ప్రయత్నం చేస్తుంటే అడ్డుకున్నామని, కరోనా సమయంలోనూ అరెస్టులకు భయపడలేదని జంగాల చెప్పారు. రాష్ట్రంలో, జిల్లాలో వివిధ వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతూ రైతాంగానికి అండగా నిలబడ్డామని అన్నారు. ఈ ఎన్నికలలో అనేకమంది వ్యాపారస్తులు పోటీ చేస్తున్నారని, వారు గెలిస్తే స్వలాభం, సొంత వ్యాపారం చూసుకుంటారే తప్ప ప్రజల పక్షాన నిలబడరని చెప్పారు. పండుగకు వచ్చి పోయే చుట్టాల్లా ఉండే అభ్యర్థులు కావాలో... నిత్యం ప్రజలతో మమేకమై ప్రజా ఉద్యమాలలో భాగస్వాములుగా ఉండే అభ్యర్థులు కావాలో ప్రజలు ఆలోచించాలని కోరారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ అనునిత్యం ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న జంగాల అజయ్ కుమార్‌ను గుంటూరు పార్లమెంట్ స్థానానికి గెలిపించుకుందామన్నారు. గుంటూరు నగరంలో ఉన్న పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు, మేధావులు, ప్రజలు ఆలోచించి సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ గుర్తు కంకి కొడవలికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. జంగాలను పార్టీ, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు సత్కరించి, స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు.

మరో కొత్త తరహా ప్రయోగానికి ఇస్రో సిద్ధం

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో కొత్త తరహా ప్రయోగానికి సిద్ధమైంది. తిరుపతి జిల్లా శ్రీహరికోట నుంచి శనివారం ఉదయం 6 గంటలకు లాంచ్ ప్యాడ్ ద్వారా ప్రైవేట్ రాకెట్‌ను నింగిలోకి పంపనుంది. అగ్నికుల్ కాస్మోస్ ప్రైవేట్ స్టార్టప్ వారి అగ్నిభాణ్ రాకెట్‌ను ప్రయోగించనున్నారు. ఇందులో సెమీ క్రయోజెనిక్ ఆధారిత ఇంజిన్ ఉపయోగిస్తున్నారు. భవిష్యత్తులో చిన్న తరహా ఉపగ్రహాలను లో ఎర్త్ ఆర్బిట్‌లో ప్రవేశ పెట్టడానికి ఈ తరహా ప్రయోగాన్ని నిర్వహిస్తున్నారు. ప్రైవేట్ సంస్థలు రూపొందించిన రాకెట్లను ప్రయోగించడం ఇది రెండవసారి. గతంలో స్కై రూట్ వారు విక్రమ్-1 అనే ప్రైవేట్ రాకెట్‌ను శ్రీహరికోట నుంచి ప్రయోగించారు. అగ్నిభాణ్ ప్రైవేట్ రాకెట్ ప్రయోగానికి సంబంధించి శుక్రవారం రాత్రి 12 గంటలకు కౌంట్ డౌన్ ప్రారంభమై ఆరు గంటల అనంతరం శనివారం ఉదయం 6 గంటలకు నింగిలోకి ప్రయోగించనున్నారు. ఈ ప్రయోగాన్ని ఇస్రో చైర్మన్ డాక్టర్ సోమనాథ్ పర్యవేక్షిస్తారు.

10 వరకు పాలిసెట్ గడువు పొడిగింపు

సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి

ఎంట్రన్స్ కోచింగ్ కోసం 8 నుంచి కొత్త బ్యాచ్ ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పాలిసెట్ 2024 ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువును ఏప్రిల్ 10వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ సాంకేతిక విద్య, శిక్షణా మండలి చైర్మన్ చదలవాడ నాగరాణి తెలిపారు. శుక్రవారంతో దరఖాస్తు గడువు ముగిసినప్పటికీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నుంచి అందుతున్న వినతుల మేరకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఆన్‌లైన్ అప్లికేషన్‌లకు మరో ఐదు రోజులు గడువును పొడిగిస్తున్నామన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 27వ తేదీన యధావిధిగా జరుగుతుందన్నారు. పాలిసెట్ 2024 ప్రవేశ పరీక్ష కోసం విద్యార్థులకు అందిస్తున్న ప్రత్యేక శిక్షణా తరగతులు ఉత్సాహభరిత వాతావరణంలో జరుగుతున్నాయని, విద్యార్థులకు ఇస్తున్న సమగ్ర శిక్షణకు మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. అనేక ఎంట్రన్స్ కోచింగ్ కేంద్రాలను స్వయంగా సందర్శించి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేయటమే కాకుండా, పాలిటెక్నిక్ తదుపరి అందివచ్చే ఉపాధి అవకాశాలను గురించి తల్లిదండ్రులకు సైతం అవగాహన కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ఈ శిక్షణకు మంచి డిమాండ్ ఉందని, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోరిక మేరకు 8వ తేదీ నుంచి మరో బ్యాచ్ ప్రారంభించేందుకు సాంకేతిక విద్యా శాఖ సన్నాహాలు చేస్తోందన్నారు. రాష్ట్రంలోని 87 ప్రభుత్వ, 182 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో ఏప్రిల్ 24 వరకు తరగతులు నిర్వహించి ఏప్రిల్ 25న గ్రాండ్ ఫ్రీ ఫైనల్ ఎంట్రన్స్ ఎగ్జామ్‌ను సైతం నిర్వహిస్తామన్నారు. తెలుగు, ఇంగ్లీషు మాధ్యమ విద్యార్థులకు ఉపకరించేలా రెండు భాషలలోనూ స్టడీ మెటీరియల్‌ను అందిస్తామన్నారు. శిక్షణలో రెండు గంటల పాటు గణితం, ఒక గంట భౌతిక శాస్త్రం, మరో గంట రసాయన శాస్త్రం బోధిస్తారని కమిషనర్ నాగరాణి తెలిపారు.



'ఇన్నోవేషన్, సస్టైనబుల్ బిజినెస్ ప్రాక్టీసెస్ ఇన్ డిజిటల్ ఎరాపై

వీఐటీలో అంతర్జాతీయ సదస్సు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వీఐటీ-ఏపీ స్కూల్ ఆఫ్ బిజినెస్, న్యూకాజిల్ విశ్వవిద్యాలయం (ఆస్ట్రేలియా), ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ బెటర్ ఫ్యూచర్ (ఆస్ట్రేలియా) సంయుక్త సహకారంతో 'ఇన్నోవేషన్, సస్టైనబుల్ బిజినెస్ ప్రాక్టీసెస్ ఇన్ డిజిటల్ ఎరా' అనే అంశంపై రెండు రోజులపాటు జరిగే అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సదస్సులో నేటి డిజిటల్ యుగంలో ఇన్నోవేషన్, సుస్థిరత లక్ష్యాలపై కీలక ప్రసంగాలు, ప్యానెల్ చర్చలు, సాంకేతిక సెషన్, ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. వ్యాపార వృద్ధి, పర్యావరణ సారథ్యం రెండింటినీ ప్రోత్సహించే అత్యాధునిక వ్యూహాలు, సాంకేతికతలు, ఆదర్శప్రాయమైన పద్ధతులను అన్వేషించడానికి ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ, వ్యవస్థాపకత ప్రాముఖ్యతపై అవగాహన పెంచడమే సదస్సు ముఖ్య ఉద్దేశ్యమని వీఐటీ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి తెలిపారు. వర్సిటీలో ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు నిధులు అందచేస్తున్నామని చెప్పారు. వర్సిటీలోని ప్రతి విద్యార్థి దీనిని ఉపయోగించుకోవాలని కోరారు. 2023లో 1050 కంటే ఎక్కువ పరిశోధనాత్మక ప్రచురణలు, 500 కంటే ఎక్కువ పేటెంట్‌లను దాఖలు చేసిన ఘనత వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం సాధించిందని వివరించాచారు.

ముఖ్య అతిథి పాప్స్ ముప్పా (డిజైన్ రిక్రూటింగ్, జేపీ మోర్గాన్ చేజ్-యూఎస్‌ఏ)... ప్రస్తుత వ్యాపార రంగంలో జరుగుతున్న సాంకేతిక మార్పులను వివరించారు. డిజిటల్ యుగంలో వ్యాపారాలు అభివృద్ధి చెందడానికి సృజనాత్మక ఆవిష్కరణలు, స్థిరత్వం అనివార్యంగా మారాయని ఆయన అభిప్రాయపడ్డారు. అటువంటి సహకార ప్రయత్నాలను ప్రోత్సహించడం సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కోవడంలో, సానుకూల మార్పును తీసుకురావడంలో అంతర్జాతీయ సహకారం ప్రాముఖ్యతను తెలియజేశారు. డాక్టర్ అరుణ్‌కుమార్ శివకుమార్ (డీన్ ఇన్‌చార్జి, వీఐటీ-ఏపీ స్కూల్ అఫ్ బిజినెస్) మాట్లాడుతూ తొమ్మిది టెక్నికల్ సెషన్‌లలో మొత్తం 109 పేపర్లు సదస్సులో సమర్పించబడ్డాయని వివరించారు. వీఐటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీశ్‌చంద్ర ముదిగంటి, డాక్టర్ మార్టీ చియా (అసోసియేట్ ప్రొఫెసర్, న్యూకాజిల్ బిజినెస్ స్కూల్- ఆస్ట్రేలియా), డాక్టర్ రవీంద్ర ధూలీ (డీన్-రీసెర్చ్, వీఐటీ-ఏపీ వర్సిటీ), జయశ్రీ గోపాల్ (న్యూకాజిల్ యూనివర్సిటీ), డాక్టర్ సీతాలక్ష్మి, డాక్టర్ మొహమ్మద్ అబ్దుల్ ముఖీత్ మాజ్, వర్సిటీ ప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీలోకి రఘురామకృష్ణరాజు

విశాలాంధ్ర-పాలకొల్లు: నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు టీడీపీలో చేరారు. పాలకొల్లు సభలో అధినేత చంద్రబాబు సమక్షంలో శుక్రవారం ఆయన ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. రఘురామకు టీడీపీ కండువా వేసి చంద్రబాబు ఆయన్ను సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రఘురామ మాట్లాడుతూ.. చంద్రబాబు చొరవతో మళ్లీ ప్రజలముందుకొచ్చానన్నారు. జూన్ నాలుగున చంద్రబాబు, పవన్ ప్రభంజనం సృష్టించబోతున్నారని జోస్యం చెప్పారు. చంద్రబాబు మాట్లాడుతూ... "ఒక సైకో పాలనలో ప్రాణాలు ఒడ్డి ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడిన వ్యక్తి రఘురామ అన్నారు. మీ అందరి ఆమోదంతో ఆయన్ను మనస్ఫూర్తిగా టీడీపీలోకి ఆహ్వానిస్తున్నామన్నారు.

సింగిల్‌గా వస్తానని శవాలతో వస్తున్న జగన్

పెన్షనర్లను వాడుకుని లబ్ధి పొందాలని కుట్ర

గుంటూరు, అనంతపురం వైసీపీ నేతలు లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిక

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ప్రతి ఎన్నికకు సింగిల్ వస్తానని చెబుతున్న జగన్ శవాలతో వస్తున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. 2014లో తండ్రి, 2019లో బాబాయి శవాన్ని వాడుకున్నారు, ఇప్పుడు పెన్షనర్లను వాడుకుని ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నారని లోకేశ్ మండిపడ్డారు. ఉండవల్లి నివాసంలో గుంటూరు కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళీమోహన్ సహా వైసీపీ ముఖ్య నేతలు లోకేశ్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరందరికీ పసుపు కండువాలు కప్పి యువనేత పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే అనంతపురం వైసీపీ నగర మాజీ అధ్యక్షుడు జయరాం నాయుడు, అనంతపురం రూరల్ మాజీ ఎంపీపీ హేమలత అధ్వర్యంలో వారి అనుచరులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ జగన్ రెడ్డి గొప్ప నటుడని, ప్రజల వద్ద సానుభూతి పొందేందుకు పెన్షన్ల అంశాన్ని ప్రచారాస్త్రంగా వాడుకుంటున్నాడని ఆరోపించారు. జగన్ మాయ మాటలకు ప్రజలు మోసపోవద్దు. జగన్ పాలనలో ఎన్నడూ లేనివిధంగా బీసీ సోదరులపై 26 వేలకు పైగా అక్రమ కేసులు నమోదు చేశారు. తన అక్కను వేధిస్తున్నారని ప్రశ్నించినందుకు అమర్‌నాథ్ గౌడ్ అనే బాలుడుని పెట్రోల్ పోసి దారుణంగా చంపారు. కూటమి ప్రభుత్వంలో బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకువస్తాం. అధికారంలోకి వచ్చాక ఆదరణ పథకాన్ని పునరుద్ధరించి నాణ్యమైన పనిముట్లు అందజేస్తాం. అలాగే రంజాన్ తోఫా, షాదీ ఖానాల నిర్మాణం, రంజాన్ సమయంలో మసీదుల మరమ్మతులకు నిధులు, దుల్హన్ పథకం, విదేశీ విద్య ద్వారా మైనార్టీలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర సహకారం అవసరం. అందుకే ప్రజలంతా కూటమిని ఆశీర్వదించాల్సిందిగా కోరుతున్నామని లోకేశ్ విజ్ఞప్తి చేశారు.

జగనన్న వదిలిన బాణమే వైసీపీని పొడుస్తోంది : జనసేన నేత పృథ్వీ

జగనన్న వదిలిన బాణం ఇప్పుడు వైసీపీనే పొడుస్తోందని సినీనటుడు, జనసేన నేత పృథ్వీ అన్నారు. జగన్ వదిలిన బాణం పోటు దెబ్బ 12 శాతం ఓట్లపై ప్రభావం చూపుతుందన్నారు. ఉండ వల్లిలో నారా లోకేశ్‌తో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రచార కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి ప్రచార కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ ఎన్నికల్లో వైసీపీ ఓటమి ఖాయమని స్పష్టం చేశారు. జగన్‌కు ప్రజలతో పాటు ప్రకృతి కూడా జవాబిస్తుందని, 2019లో వైసీపీ విజయానికి తాడేపల్లిలో టపాసులు కాల్చానని గుర్తు చేసుకున్న ఆయన, ఈసారి మళ్లీ అక్కడే టపాసులు వైసీపీ ఓటమికి కాల్చుతానని చెప్పారు.

పేదలపై బైండోవర్ కేసులు ఎత్తివేయాలి

సీపీఎం డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గుడిసెలు వేసుకున్న పేదలపై పెట్టిన బైండోవర్ కేసులు ఎత్తివేయాలని, పేదలకు ఇళ్ల స్థలాలు చూపాలని సీపీఎం డిమాండ్ చేసింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశానికి పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు విచ్చేశారు. వివిధ అంశాలను సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆయా వివరాలను శుక్రవారం పార్టీ కార్యాలయం వెల్లడించింది. తిరుపతి, ఎర్రగుట్టలో గుడిసెలు వేసిన 17మంది పేదలపై అక్రమంగా బైండోవర్ కేసులు పెట్టారనీ, వీటిని ఉపసంహరించాలని సమావేశం డిమాండ్ చేసింది. ఏలూరు జిల్లా దోశపాడులో పోలీసుల నిర్బంధం, కడప జిల్లా బద్వేల్ పట్టణంలో పేదలు వేసుకున్న గుడిశలను కూల్చివేయడాన్ని తీవ్రంగా ఖండించింది. పేదలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేసింది. కరకంబాడి పంచాయతీ సర్వే నెం. 153/1లో ఉన్న 125 ఎకరాల గుట్టను వైసీపీ నాయకులు ఆక్రమించి గ్రావెల్ తవ్వకాలు చేపట్టారని, మరోవైపు జగనన్న ఇళ్ల పట్టాలు పొందిన పేదలకు స్థలాలు చూపలేదని సమావేశం గుర్తుచేసింది. నాలుగేళ్లుగా స్థలాలు చూపకపోవడం వల్లనే నిర్లక్ష్యాన్ని వ్యతిరేకిస్తూ ఎర్రగుట్టపై గుడిసెలు వేసుకున్నారని, ప్రత్యామ్నాయం చూపకుండా అధికారులు దుర్మార్గంగా పేదల గుడిసెలను తొలగించారని వివరించారు. స్థలాలు చూపమని కూల్చివేసిన తర్వాత నెలరోజులుగా పేదలు అధికారుల చుట్టూ తిరిగారని, 2018లో జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పుపై కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వివరించింది. పేదలు మళ్లీ ఎక్కడ ఎర్రగుట్టలో గుడిసెలు వేస్తారనే అనుమానంతో 17 మంది సీపీఎం నాయకులు, పేదలను ఇళ్ల వద్ద తెల్లవారు జామున అరెస్టు చేసి రేణిగుంట, ఎయిర్‌పోర్టు స్టేషన్లకు తరలించారని వివరించింది. అక్రమంగా పెట్టిన కేసులను ఉపసంహరించాలని, పేదలకు ఇంటిస్థలాలు చూపాలని డిమాండ్ చేసింది. ఏలూరు జిల్లా దోశపాడు గ్రామంలో 120 ఎకరాలు దళితుల భూములను పెత్తందార్లు ఆక్రమించు కున్నారని తెలిపింది. కడప జిల్లా బద్వేల్, మరో మూడు ప్రాంతాలలో పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తుంటే రాత్రికి రాత్రి గుడిసెలను కూల్చివేశారని, పేదలకు సంబంధించి వంట సామానులు, దుస్తులు, సామాగ్రి కాలిపోయాయని, ఇంత దారుణానికి పాల్పడిన అధికారులు, పోలీసులపై చర్యలు తీసుకోవాలని సమావేశం డిమాండ్ చేసింది.

నేటితో పెన్షన్ పంపిణీ ముగింపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సామాజిక పెన్షన్ల ప్రక్రియ పూర్తి చేసేందుకుగాను ప్రభుత్వం ఈనెల 6వ తేదీని డెడ్‌లైన్ పెట్టుకుంది. ఈనెల 3 నుంచి పెన్షన్ల ప్రక్రియను ప్రారంభించినప్పటికీ, అడుగడుగునా అవ్వా తాతలకు అవాంతరాలు ఎదురయ్యాయి. వృద్ధులు, వికలాంగుల అవస్థలు, ఆగ్రహావేశాల నడుమ పెన్షన్ల ప్రక్రియ కొనసాగుతోంది. అందరికీ ఇంటింటా కాకుండా సచివాలయాల నుంచి పెన్షన్లు పంపిణీ చేస్తుండటంతో లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎట్టకేలకు పెన్షన్ల ప్రక్రియ ముగింపు దశకు చేరుకోనుంది. 5వ తేదీ నాటికి పెన్షన్ల ప్రక్రియ 88.02 శాతం పూర్తయినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. రాష్ట్ర వ్యాప్తంగా 65,69,094 మంది పెన్షన్ దారులు ఉండగా, వారిలో 57,83,112 మందికి పెన్షన్లు అందజేశారు. ఈ సంఖ్య శుక్రవారం నాటికి మరింత పెరగనుంది. ప్రతినెలా ఒకటో తేదీన వలంటీర్ల ద్వారా పెన్షన్లు అందజేయడం అనవాయితీగా వస్తోంది. ఈ పెన్షన్ల పంపిణీకి వలంటీర్లను ఎన్నికల సంఘం దూరం పెట్టడంతో లబ్ధిదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఒక వైపు వృద్ధులు, వికలాంగులకు ఇంటివద్దకు వచ్చి పెన్షన్లు ఇస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ, వారు సచివాలయాలకు వెళ్లి సకాలంలో పెన్షన్లు అందక అవస్థలకు గురవుతున్నారు. మండుటెండల కారణంగా చాలా జిల్లాల్లో వృద్ధులు బారులుతీరి మృత్యువాతకు గురయ్యారు. అటు పెన్షన్ల ప్రక్రియ నుంచి తమను దూరం చేయడం, తమపై టీడీపీ, జనసేన అవమానకరంగా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ, వలంటీర్ల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా చాలా జిల్లాల్లో వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నారు.

అచ్చెన్న, అయ్యన్నకు ఈసీ నోటీసులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సోషల్ మీడియా వేదికగా సీఎం జగన్‌పై ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా వ్యాఖ్యలు చేసిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, సీనియర్ నేత అయ్యన్నపాత్రుడుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటీసులు జారీజేసింది. వైసీపీ ఫిర్యాదులపై స్పందించిన ఈసీ 48 గంటల్లోగా వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొంది. జగన్‌పై అభ్యంతరకర, అనుచిత వ్యాఖ్యలు చేయడం, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులు పెట్టడంపై ఈనెల రెండో తేదీన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి ఫిర్యాదు చేశారు. వాటికి సంబంధించి ఆధారాలను సైతం ఎన్నికల కమిషన్‌కు అందజేశారు. ఈ క్రమంలో ఎన్నికల సంఘం నోటీసులు ఇచ్చింది. పెత్తందారు జగన్... పెన్షన్ నిధులను మళ్లించారంటూ జగన్‌పై కార్టూన్లు తయారుచేసి వాటిని ఎక్స్ వేదికగా పోస్ట్ చేసిన ఆధారాలను ఎన్నికల సంఘానికి లేళ్ల అప్పిరెడ్డి అందజేశారు.

రేపు అనకాపల్లి, 8న యలమంచిలిలో పవన్ కళ్యాణ్ సభలు

విశాలాంధ్ర-గుంటూరు: వారాహి విజయ భేరి యాత్రలో భాగంగా ఈ నెల 7న అనకాపల్లిలో, 8వ తేదీన యలమంచిలి నియోజకవర్గంలో నిర్వహించే సభలలో జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పాల్గొంటారని పార్టీ రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా 9వ తేదీన పిఠాపురం నియోజకవర్గంలో నిర్వహించనున్న ఉగాది వేడుకల్లో జనసేనాని పాల్గొంటారన్నారు. తీవ్రమైన జ్వరం కారణంగా వారాహి విజయభేరి సభలకు విరామం ఇచ్చిన విషయం విదితమే. కోలుకున్న పవన్ కళ్యాణ్ 7వ తేదీ నుంచి యధావిధిగా ఎన్నికల ప్రచార యాత్రను కొనసాగిస్తారని, నెల్లిమర్ల, విశాఖ దక్షిణ, పెందుర్తి నియోజకవర్గాల్లో పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను త్వరలో ఖరారు చేస్తారని వెల్లడించారు.

వైసీపీని వీడిన ఇద్దరు నేతలు

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: వైసీపికి మరో ఇద్దరు నేతలు రాజీనామా చేశారు. షేక్ ఇక్బాల్ పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. హిందూపురానికి చెందిన ఎమ్మెల్సీ ఇక్బాల్ వైసీపీలో కొంత కాలంగా మౌనంగా ఉన్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో హిందూపురం నుంచి ఆయన ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం వైసీపీ ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చింది. రాబోయే ఎన్నికల్లోనూ ఆయన వైసీపీ ఎమ్మెల్యే టికెట్‌ను ఆశించగా...దక్కలేదు. దీంతో ఆయన కలత చెంది రాజీనామా చేసినట్లు తెలిసింది. కాగా వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేసినట్లు ఆయన వెల్లడించారు. పార్టీకి రాజీనామా లేఖను అధినేత జగన్‌కు, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా లేఖను శాసన మండలి చైర్మన్‌కు పంపారు. ఇక వైసీపీకి చెందిన మరో కీలక నేత, మాజీ మంత్రి కిల్లి కృపారాణి పార్టీకి రాజీనామా చేశారు. శ్రీకాకుళంజిల్లాకు చెందిన కృపారాణి ఎమ్మెల్యే టికెట్‌ను ఆశించి భంగపడ్డారు. దీంతో ఆమె పార్టీకి రాజీనామా చేశారు. కడపజిల్లా బద్వేల్ ప్రచార పర్యటనలో ఉన్న షర్మిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ నుంచి టెక్కలి అసెంబ్లీ టికెట్‌ను ఆమె ఆశిస్తున్నారు.



జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చాలా చోట్ల ఆయన విగ్రహాలకు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, దళిత, సామాజిక సంఘాల ప్రముఖులు పూలమాలలేసి నివాళులర్పించారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి కాంగ్రెస్ విజయవాడ నగర అధ్యక్షుడు నరహరశెట్టి నరసింహారావు పూలమాలేసి నివాళులర్పించారు. ఆ పార్టీ సీనియర్ నేతలు వి.గురునాథం, ఏఐసీసీ సభ్యుడు మేడా సురేశ్, పీవై కిరణ్, బైపూడి నాగేశ్వరరావు, ఎన్ఎస్‌యూఐ నేత శ్రీనివాస్, గణేశ్, శివప్రసాద్, రత్నాకర్ పాల్గొన్నారు.

వైఎస్ కుటుంబంలో చిచ్చుకు కుట్ర: వాసిరెడ్డి పద్మ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైఎస్ కుటుంబంలో కొందరు చిచ్చుపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని వైసీపీ నాయకురాలు వాసిరెడ్డి పద్మ మండిపడ్డారు. పార్టీ తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, వైఎస్ వివేకానందరెడ్డి హత్యా రాజకీయ పరిణామాలను కడప ప్రజలు గమనిస్తున్నారన్నారు. షర్మిలకు వ్యవస్థలపైన, కోర్టులపైన నమ్మకం లేదా అని ప్రశ్నించారు. వ్యక్తిగత అజెండాలతో జగన్‌పై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. జగన్‌ను విడదీయాలని చూస్తున్న కుట్రలకు కడప ప్రజలకు కొత్తేమీ కాదన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా తమ ముఖ్యమంత్రిని కాపాడు కునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

సంపాదకీయం

మదర్సాల రద్దుకు "సుప్రీం" బ్రేకు

సైనిక పాఠశాలలకు కాషాయ రంగు పులుముతున్న బీజేపీ మదర్సాల మీద మాత్రం కత్తిగట్టినట్టు ప్రవర్తిస్తోంది. కాషాయాంబరధారి అయిన యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం మదర్సాల విషయంలో మీరిన వ్యతిరేకవైఖరి అనుసరిస్తున్నారు. 2004 నాటి మదర్సా విద్యా చట్టాన్ని రద్దు చేశారు. అలహాబాద్ హైకోర్టు ఈ రద్దుకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. కానీ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మదర్సాలపట్ల విద్వేషానికి సుప్రీంకోర్టులో అడ్డుపడింది. అలహాబాద్ హైకోర్టు తీర్పు చెల్లదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచి అలహాబాద్ హైకోర్టు తీర్పు అమలు మీద స్టే విధించింది. మదర్సాలను నిషేధించాలన్న యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వ పథకం అమలై ఉంటే వీటిలో చదువుకుంటున్న 17లక్షల మంది విద్యాభ్యాసానికి గండిపడి ఉండేది. పైగా భారీ సంఖ్యలో ఉపాధ్యాయులు ఉపాధి కోల్పోయి రోడ్డు మీద నిలబెట్టేవారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మదర్సాలు 2004 నాటి మదర్సా బోర్డు చట్టం ప్రకారం విద్యాభ్యాసం కొనసాగించవచ్చు. అలహాబాద్ హైకోర్టు నిర్ణయం సరైంది కాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. అలహాబాద్ హైకోర్టు తీర్పును రద్దు చేయడానికి సంబంధించి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ......గత నెల అలహాబాద్ హైకోర్టు మాత్రం 2004 నాటి మదర్సాల బోర్డు చట్టం "రాజ్యాంగ విరుద్ధమైంది" అని ప్రకటించింది. ఈ చట్టం సెక్యులర్ సూత్రాలను ఉల్లంఘిస్తోందని తేల్చి మదర్సాలలో చదువుకుంటున్న వారిని మామూలు విద్యా వ్యవస్థలో భాగస్వాములను చేయాలని ఆదేశించింది. అయితే శుక్రవారం సుప్రీంకోర్టు ఇంతకు ముందు హైకోర్టు ఇచ్చిన తీర్పు అమలుపై స్టే విధిస్తూ జారీ చేసిన ఉత్తర్వులో మదర్సాల బోర్డు చట్టం నియంత్రించడానికి ఉద్దేశించిందే తప్ప ఆ బోర్డు ఏర్పాటే సెక్యులరిజాన్ని వమ్ము చేస్తుందనడం సరైన ధోరణి కాదని పేర్కొంది. మదర్సాలు కేవలం మతపరమైన అంశాలు బోధించే కేంద్రాలు కాదని కూడా వ్యాఖ్యానించింది. మదర్సా బోర్డు చట్టాన్ని కొట్టివేస్తూ తీర్పు చెప్పినప్పుడు అలహాబాద్ హైకోర్టు మదర్సాలలో చదువుతున్న 17 లక్షల మంది విద్యార్థులను ఇతర పాఠశాలల్లో చేర్పించాలని సూచించింది. అయితే వీరిని ఇతర పాఠశాలల్లో చేర్పించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ అయిదు అర్జీలు దాఖలైనాయి. మదర్సాల విషయంలో దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం ఉద్దేశం మదర్సాలలో సెక్యులర్ విద్యా విధానం ఉండాలని, లెక్కలు, సైన్సు, చరిత్ర, వివిధ భాషలు నేర్చే అవకాశం ఉండాలన్నదే. అయితే దానికి పరిష్కారం 2004 నాటి చట్టాన్ని రద్దు చేయడమే విరుగుడు కాదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ స్పష్టం చేశారు.

విచిత్రం ఏమిటంటే సెక్యులర్ భావాలను అడుగడుగునా అణగదొక్కుతున్న ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం హైకోర్టు తీర్పును సమర్థించాయి. మదర్సాలలో జరిగే మతపరమైన అంశాల బోధనపై చర్చ జరగాలని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వాదించింది. మదర్సాల తరఫున వాదించిన ప్రసిద్ధ సుప్రీంకోర్టు న్యాయవాది మతపరమైన విద్య అంటే మత బోధన కాదని గుర్తుచేశారు. అలహాబాద్ హైకోర్టు తీసుకున్న నిర్ణయంవల్ల మదర్సాలలో పనిచేస్తున్న పది వేలమంది ఉపాధ్యాయులు ఉపాధి కోల్పోతారని 17 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని సింఘ్వి వాదించారు. అయితే ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం వాదించింది. 2004 నాటి మదర్సా బోర్డు చట్టం రాజ్యాంగ విరుద్ధమైందని హైకోర్టు మార్చి 22న తీర్పు చెప్పింది. రాష్ట్రంలో నిర్వహిస్తున్న మదర్సాలు కూడా రాజ్యాంగ విరుద్ధమేనని హైకోర్టు అభిప్రాయపడింది. అలహాబాద్ హైకోర్టు ఈ చట్టంలోని అంశాలను సరైన దృక్పథంతో చూసినట్టు లేదని కూడా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. 2004 నాటి మదర్సాల చట్టం "రాజ్యాంగ విరుద్ధమైంది" అని తేల్చిన అలహాబాద్ హైకోర్టు విచిత్రంగా ఈ చట్టంలోని అంశాలు రాజ్యాంగ మౌలిక చట్రానికి విరుద్ధమైనవి అని కూడా అభిప్రాయపడింది. హైకోర్టు చేసిన వ్యాఖ్యలను జాగ్రత్తగా పరిశీలిస్తే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ దృక్పథానికి అతికినట్టు సరిపోతుంది. దీన్నిబట్టి కొన్ని రాష్ట్రాల హైకోర్టులు బీజేపీ భావజాలానికి అనుకూలమైన తీర్పులు చెప్తున్నాయన్న వాదనకు మరింత బలం చేకూరింది. హైకోర్టు చెప్పిన తీర్పు అమలుపై స్టే విధిస్తూ ఆదేశాలు జారీచేసిన సుప్రీంకోర్టు మదర్సాల బోర్డు చట్టం కేవలం వీటి నియంత్రణకు ఉపకరించేది అని తేల్చి చెప్పింది. మదర్సాలలో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలనుకుంటే అసలు మదర్సాల బోర్డు చట్టమే రాజ్యాంగ విరుద్ధమైందని చెప్పడం సరైన విధానం కాదని సుప్రీంకోర్టు ఈ చట్టం చెల్లదన్న వాదనలోని అంతస్సారాన్ని, అది ఏ పక్షం వాదన అన్న విషయాన్ని చక్కగా అంచనా వేసింది. అందరికీ నాణ్యమైన విద్య అందాలనడంలో రాష్ట్రం ప్రజాప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకున్నట్టేనని సుప్రీంకోర్టు భావించింది. అదే సమయంలో హైకోర్టు ఈ చట్టాన్ని సమగ్రంగా తూకం వేయలేదని కూడా నిర్మోహమాటంగా తెలియజేసింది. వివిధ మతాల వారికీ ప్రత్యేక విద్యా సంస్థలున్నాయి. క్రైస్తవులు మిషనరీ పాఠశాలలు నడుపుతుంటారు. హిందూమతం వారు ప్రత్యేకంగా నిర్వహించే పాఠశాలలు ఏమీ లేవన్న మాట వాస్తవమే. కానీ హిందూ మతోద్ధరణకు కంకణం కట్టుకున్న సంఘ్ పరివార్ నిర్వహించే సరస్వతీ విద్యా మందిరాలు, శిశు మందిరాలు హిందూ మతం గురించి బోధించకుండా మానడం లేదు. అయితే ఒక్క మదర్సాల దగ్గరకు వచ్చేటప్పటికి అభ్యంతరాలు వ్యక్తం అవుతూ ఉంటాయి. గత పదేళ్ల కాలంలో ఈ ఆలోచనా ధోరణి విపరీతంగా పెరిగిపోయింది. తాముచేసే పనే ఇతర మతాలవారు చేస్తే సంఘ్ పరివార్ బొత్తిగా భరించలేదు. ముఖ్యంగా మదర్సాలపై సంఘ్ పరివార్‌తో సహా కొన్ని వర్గాల వారి వాదనలు విపరీతంగా ఉంటాయి. ఇలాంటి వర్గాలు సెక్యులరిజం గురించి మాట్లాడడం విపరీత వైఖరిలా కనిపించక మానదు.

అతడు... అల్లం రాజయ్య...

దశాబ్దాల వయసు వచ్చాక కన్నీటి తెరతో అక్షరాలు మసకబారడం మీకెప్పుడైనా అనుభవమైందా... ఏడుపు వాసనతో ముక్కుపుటాలు పైకి ఎగదోయడం ఏనాడైనా జరిగిందా... ఇదిగో ఈమధ్యనే నాకు అక్షరాలు వేళ్లకు అంటుకుని అన్నం ముద్ద గొంతు దిగడం లేదు. చదివినవే, అతడ్ని అనాడెప్పుడో కలిసి చేతులు కలిపిన అనుభవమే. కానీ ఇదిగో ఈ మధ్యనే మళ్లీ రీ రీడింగ్... రీ రైటింగ్ కాదు సుమా.. రీ రీడింగ్... అతడ్ని తిరిగి చదవడం ప్రారంభించాకే ఆ రచనల్లోని పాత్రలు నా పక్కనే పడు కున్నట్లు... నాతో కలిసి నడుస్తున్నట్లు... నా గలాసులో కలగలిసిపోయి కడుపులో దేవుతున్నట్లు అనిపిస్తోంది.

" అతను షాపుల్లో నుండి వ్యాపార లావాదేవీల్లో నుంచి బయటపడి మనిషయ్యాడు. అతను వార్త అయ్యాడు. తను ఆ వార్త రాయాల్సిన విలేకరయ్యాడు" ఇది అల్లం రాజయ్య రాసిన అతడు నవలికలో అతని జీవితం గురించి, అతని స్నేహితుడి జీవిక గురించి రాసిన వాక్యం. ఒకటి మనిషి జీవితం, మరొకటి మరో మనిషి జీవిక. ఈ తేడాని ఎంత గొప్పగా చెప్పాడు రాజయ్య. మనం "అతడు"లా జీవించలేకపోవచ్చు. అతని స్నేహితుడు విలేకరిలా జీవశ్చవాల్లా మిగిలిపోవచ్చు. 1995 సంవత్స రంలో ఆహ్వానం పత్రికలో ఈ కథ వచ్చినప్పుడు కదిలిపోయిన సందర్భం ఇంకా కళ్ల ముందు కదలాడుతోంది. కానీ, ఇన్నేళ్ల తర్వాత చదివినా ఇంకా ఎందుకు వెంటాడుతోంది. బహుశా, మనిషిని కుదిపేసే, నిలువ లేకుండా చేసేది సాహిత్యం మాత్రమేనేమో.

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

అతడు " అచ్చమైన - కన్నీళ్లంత ఎచ్చనైన కొడుకులా" ఉన్నాడు. ఈ లైను చదివిన తర్వాత అతడు కళ్ల ముందు కదలాడడం యాదృశ్చికం కాదు. కదలాడతాడు కూడా. బహుశా... బెర్టోల్ బ్రెష్ట్ అన్నట్లు చీకటి రోజుల గురించి గానం చేయడమంటే ఇదేనేమో... అతడ్ని కలిసిన ఓ కార్మికుడి భార్య " ఈ ప్రపంచంలో ఆడవాళ్లకు అక్క, తల్లి, భార్య, మొగవాళ్లకు తండ్రి, కొడుకు, భర్త ఇలాంటి పేర్లు కాక మరేవీ లేవా...? " అని అడగాలనిపించింది. అడిగింది కూడా. అతను "ఉందమ్మా.. అది రక్త సంబంధం కన్నా గొప్ప సంబంధం. కోట్లాది మానవులను కలిపే ఉత్పత్తి సంబంధం" అంటాడు. ఇలా అన్నాడు కనుకనే అతడు... అల్లం రాజయ్య అనాలనిపించింది నాకు. పాతవే. ఎప్పుడో చదివినవే. పుస్తకాల అల్మారా నుంచి మీ వైపు చూస్తూ ఉంటాయి. నీ వొడిలోకి తీసుకుని చదవమని పిలుస్తూంటాయి. కళ్ల ముందు కొత్త నీరు కళకళలాడు తూంటూంది కదా.. పాత నీటిని చూసేసాం కదా... ఇకేముంటుంది అనిపిస్తూంటుంది. అందుకే అటువైపు చూడం. లేదూ చూడడానికి ఇష్టపడం. కానీ పాత నీటిలో ఊట ఊరిస్తుందని, అది తిరిగి పునశ్చరణ చేస్తే తప్ప తెలుసుకోలేం. ఇదిగో ఈ అల్లం రాజయ్య కథల్లా. అప్పు డెప్పుడో మహా రచయిత మాక్సింగోర్కి విచ్ఛిన్నమవుతున్న వ్యక్తిత్వం గురించి చెప్పాడు. అది జరిగిన చాలా కాలం తర్వాత అల్లం రాజయ్య మనిషి లోపలి విధ్వంసం గురించి చెప్పాడు.

" మనుషుల చావు ఒక ఘడియలో జరుగగలదన్న దాని కన్నా, సంవత్సరాల తరబడి జరుగుతుందనేది అతని అనుభవం లోంచి బలపడిన నమ్మకం" అని మనిషిలోని విధ్వంసాన్ని చూపించాడు అల్లం రాజయ్య. ఈ విధ్వంసాన్ని దశాబ్దాలుగా అనుభవించడానికే అలవాటు పడిపోయాం కదా... ఇక దాన్నుంచి బయటపడేందుకు ఎలా ప్రయత్నిస్తాం. ఎందుకు ప్రయత్నిస్తాం. మనుషుల ముందు "ఏడుపు తెరలు తెరలుగా చలిలా, చీకటిలా చుట్టేస్తుంది" అన్న నిజం తెలుసుకోవడం ప్రమాదకరం. గోర్కీ చెప్పినా... రాజయ్య చెప్పినా మానవుల దుఃఖం గురించే కాబట్టే దాన్ని తెలుసుకుని ఏం చేస్తామన్న నిర్లిప్తత మనల్ని వీడదు. కానీ ఆ ఎరుకైనా కలిగి ఉండాలి కదా... అందుకే చదివినవే... పాతవే... కొన్నాళ్ల జీవిక తర్వాత మానవుల్లా మరికొంత కాలం జీవించేందుకు వాటిని చదవాల్సిందే. ఓ బ్రాహ్మణ పిల్లవాడు రైతులా కలకనడం, ఆ కలను ఏలిక విచ్ఛిన్నం చేయడం కలలోనైనా కంటామా.. కళ్ల ముందు గోబీ పూల వనం ఉన్నట్లుగా, తాను పెంచిన ఆ గోబీ పూలను ఆప్యాయంగా, మురిపెంగా తాకుతున్నట్లుగా ఓ విభ్రమలో ఉన్న మహదేవుడి కల విధ్వంసం కావడం దేనికి సంకేతంగా చూస్తాం. నౌకరీకి వెళ్లినా కళ్ల ముందు కదలాడిన ఆ ఎవుసాయం కాన రావడం, దానికి పిచ్చి అని నామకరణం చేయడం విధ్వంసక సమాజంలో తప్ప ఇంకెక్కడైనా చూస్తామా. "ఓ అద్భుతమైన, అరోగ్యవంతమైన సృష్టికర్త అయిన మనిషిని కొద్ది కొద్దిగా ఎట్లా చంపవచ్చునో పిచ్చాసుపత్రిలో అట్లా చంపబడ్డాడు" ఈ మహదేవుడు. ఈ కథ కూడా దశాబ్దాల క్రితం చదివిందే. అనాటి మహదేవుడు, అతని కల నాకు ఆనాటి నా జ్ఞానం మేరకు కేవలం కలగానే కనిపించి ఉండవచ్చు. ఇన్ని సంవత్సరాల తర్వాత తిరిగి చదివితే మహదేవుడి కల నాదే కావడం, నేనే ఇన్నాళ్లు అలాంటి కలను కంటూ బతుకుతున్నాననే స్పృహలోకి రావడం, నన్నే పిచ్చివాడ్ని చేశారన్న నిజం ఈనాడు ఎరుకలోకి వచ్చిన ఓ అనుభవం.

సీనియర్ జర్నలిస్ట్,
సెల్: 9912019929

భారత్‌ను ముంచెత్తనున్న చైనా విద్యుత్ వాహనాలు

ఎం కోటేశ్వరరావు

సరిహద్దు సమస్యల గురించి భారత్ మాతో రహస్యంగా చర్చలు జరుపుతోందని, మరోవైపు విదేశాంగ మంత్రి రాజీపడేది లేదని ప్రకటిస్తారని, ఇదంతా నెపం మా మీద నెట్టేందుకు చేస్తున్న ట్రిక్కు అని చైనా విదేశాంగశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. గత నెలలో బీజింగ్‌లో రెండు దేశాల ప్రతినిధులు సరిహద్దు వివాదాల గురించి 29వ దఫా చర్చలు జరిపారు. రెండు దేశాల మధ్య సాధారణ సంబంధాలు నెలకొనాలంటే సరిహద్దులో బలగాలను మోహరించితేనే సాధ్యమని చర్చల అనంతరం మలేషియా, భారత జాతీయుల సమావేశంలో జై శంకర్ చెప్పారు. సరిహద్దు సమస్యపై రాజీపడేది లేదన్నారు. భారత్‌లో జరగనున్న ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే జైశంకర్ ఇంత గట్టిగా మాట్లాడారని, సరిహద్దు వివాదానికి బాధ్యత చైనాదే అని ప్రపంచానికి చెప్పే యత్నం కూడా దీనిలో ఉందని చైనా విశ్లేషకులు పేర్కొన్నారు. అరుణాచల్ ప్రదేశ్‌ను భారత్ అంతర్భాగంగా తాము ఎన్నడూ గుర్తించలేదని, దాన్ని గురించి ప్రస్తావించటం కూడా ఎన్నికల కోసమే అని విమర్శించారు. అరుణాచల్ ప్రదేశ్‌ను చైనా జాంగ్‌నాన్ అని పిలుస్తున్నది. పురాతన కాలం నుంచి అది చైనా ప్రాంతమే అని వాదిస్తున్నది. స్వాతంత్ర్యం వచ్చిన సమయానికి అది మనదేశ అంతర్భాగంగా ఉంది. అదే విధంగా మనదని చెబుతున్న ఆక్సాయ్‌చిన్ ప్రాంతం చైనా ఆధీనంలో ఉంది. ఇది రెండు దేశాల మధ్య తెగని సరిహద్దు వివాదంగా కొనసాగుతున్నది. పరస్పరం చొరబడకుండా వాస్తవాధీన రేఖకు అటూ రెండు దేశాలూ కాపలా కాస్తుంటాయి. ఉద్రిక్తతలు తలెత్తినపుడు మిలిటరీని మోహరిస్తున్నాయి. లడక్ ప్రాంతంలోని గాల్వన్ లోయలో 2020 ఉదంతం తరువాత మోహరించిన మిలిటరీ దళాలు కొనసాగుతున్నాయి. వాటి ఉపసంహరణ గురించి చర్చలు జరుగుతున్నా కొత్త వివాదం తలెత్తలేదు తప్ప పూర్వపు స్థితి నెలకొనలేదు.

ఒక వైపు మనదేశంలోని సంఘపరివార్, ఇతర కొన్ని శక్తులు చైనా వ్యతిరేకతను నిరంతరం రెచ్చగొడుతూ ప్రచారం చేస్తుంటాయి. మరోవైపు అదే చైనా నుంచి మన దేశం రికార్డు స్థాయిలో దిగుమతులు చేసుకుంటున్నది. షియాంగ్సు రాష్ట్రం నుంచి ప్రధానంగా విద్యుత్ వాహనాలు, వాటిలో వినియోగించే లిథియమ్ అయాన్ బాటరీలు, ఫొటో వోల్టాయిక్ ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. గత రికార్డులను నరేంద్రమోదీ బద్దలు కొట్టారు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి మాసాల్లో గతేడాది అదే నెలలతో పోలిస్తే 15.8శాతం తమతో వాణిజ్యం పెరిగిందని చైనా కస్టమ్స్ శాఖ ప్రకటించింది. తూర్పు చైనాలో ప్రధాన వాణిజ్య కేంద్రంగా ఉన్న షియాంగ్సు రాష్ట్రం నుంచి బ్రెజిల్, భారత్, రష్యా, దక్షిణాఫ్రికా దేశాలతో గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి మాసాల్లో 36శాతం పెరిగి 14.4బిలియన్ డాలర్లకు చేరింది. పైన పేర్కొన్న నాలుగుదేశాలతో పాటు చైనాను కలిపి బ్రిక్స్ అని పిలుస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది జనవరి నుంచి దీనిలో సౌదీ అరేబియా, ఈజిప్టు, ఇరాన్, యుఏయి, ఇథియోపియా కూడా చేరటంతో దీన్ని బ్రిక్స్ ప్లస్ అని పిలుస్తున్నారు. ఒక వైపు చైనా మీద ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని, మనదగ్గర నుంచే మేకిన్ ఇండియా, మేడిన్ ఇండియాలో భాగంగా ఇతర దేశాలకు వస్తువులను ఎగుమతి చేసే అవకాశం వచ్చిందని మీడియా ఊదరగొడుతున్నది.

రష్యా-ఉక్రెయిన్ వివాదం ప్రారంభమైనప్పటి నుంచి చైనా ఐరోపా సమాఖ్యపై భారత్ ఆధారపడటం 1.2శాతం పెరిగిందని, సౌదీ అరేబియాపై 0.6శాతం తగ్గిందని పేర్కొన్నది. గడచిన రెండు సంవత్సరాలుగా అంతర్జాతీయ వాణిజ్యం స్థిరంగా ఉండటం, రాజకీయాల ప్రాతిపదికన వాణిజ్యం పెరిగినప్పటికీ చైనా మీద ఆధారపడటం ఎక్కువైంది. చైనాపై

ఆధారపడటాన్ని 2023లో అమెరికా 1.2శాతం తగ్గించుకుంటే మనదేశం పెంచుకుంది. ఈ కాలంలోనే చైనాపై ఆధారపడిన రష్యా వాణిజ్యం 7.1శాతం పెరగ్గా, ఐరోపా మీద 5.3శాతం తగ్గింది. 2022 నుంచి ప్రపంచ వస్తు వ్యాపారం క్రమంగా తగ్గుతున్నది, సేవల లావాదేవీలు పెరుగుతున్నాయి. మనదేశ వాణిజ్యశాఖ సమాచారం ప్రకారం, 2021-22 నుంచి 2023-24వరకు మూడు సంవత్సరాలలో 95.266 నుంచి 99.389 బిలియన్ డాలర్లకు చైనాతో వాణిజ్యం పెరిగింది. ఇదే సమయంలో చైనా వెల్లడించిన సమాచారం ప్రకారం 110.361 నుంచి 116.953 బిలియన్ డాలర్లకు చేరింది. మేకిన్, మేడిన్ ఇండియా అని పిలుపులు ఎన్ని ఇచ్చినా పారిశ్రామిక వస్తుఉత్పత్తి పెద్దగా పెరగటం లేదు.2010 నుంచి 2022 వరకు ఉన్న వివరాల ప్రకారం, వార్షిక సగటు జిడిపిలో పారిశ్రామిక రంగం వాటా 14.92శాతం ఉంది. స్టాటిస్టా అందించిన వివరాల ప్రకారం 2010లో 17శాతం ఉన్నది 2022నాటికి 13కు తగ్గింది. చైనాలో 2013-2023వరకు వార్షిక సగటు 40శాతం కాగా, 2013లో 44.2 నుంచి 2023లో 38.3శాతానికి తగ్గింది. చైనా నుంచి వచ్చే పెట్టుబడులను నిరుత్సాహపరచాలని గతంలో తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కు తీసుకుంది. విద్యుత్ వాహనాల తయారీలో మనదేశంలో 50 కోట్ల డాలర్ల పెట్టుబడులుపెట్టి స్థానికంగా ఉత్పత్తి చేస్తే చైనాతో సహా ఏ కంపెనీలనైనా అనుమతిస్తామని మన అధికారులు వెల్లడించారు. అలాంటి కంపెనీలు ఉత్పత్తిని ప్రారంభించే వరకు దిగుమతి చేసుకొనే వాహనాలపై ఇప్పుడున్న 70-100శాతం వాహనాల యుగం. ప్రస్తుతం చైనా ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది. స్థానికంగా వాటిని తయారుచేసే కంపెనీలకు చైనా విడిభాగాలు అవసరం. విద్యుత్ వాహనాలకు అవసరమైన బ్యాటరీల ఉత్పత్తిలో 75శాతంతో చైనా ముందుంది. వాహనతయారీ ఖర్చులో 40శాతం బ్యాటరీలదే. ప్రస్తుతం ప్రపంచ విద్యుత్ వాహనాల ఉత్పత్తి, ఎగుమతుల్లో చైనా 50శాతం వాటా కలిగి ఉంది. రానున్న కొద్ది సంవత్సరాల్లో భారత రోడ్లపై తిరిగే ప్రయాణ, వాణిజ్య విద్యుత్ వాహనాల్లో ప్రతి మూడింటిలో ఒకటి చైనా సంస్థలు లేదా వాటితో భాగస్వామ్యం కలిగినవే ఉత్పత్తి చేయనున్నాయని ఆ రంగ నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే కొన్ని కంపెనీలు ఆమేరకు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. అందువలన అనివార్యమై కేంద్ర ప్రభుత్వం చైనా పెట్టుబడులు, వాహనాలకు అనుమతి ఇచ్చింది.వాటిలో ఒకటైన బ్రిటన్‌కు చెందిన ఎంజి మోటార్స్ ఇండియా ఈ ఏడాది సెప్టెంబరు నుంచి ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. అనేక చైనా కంపెనీలు రంగ ప్రవేశం చేయనున్నాయి. దీంతో చైనా నుంచి విడిభాగాల దిగుమతులు కూడా ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతాయి. టెస్లా, విన్‌ఫాస్ట్ వంటి ఇతర దేశాల కంపెనీలు కూడా చైనా వాహనాలతో పోటీ పడేందుకు చూస్తున్నాయి.

గాల్వన్ ఉదంతం తరువాత 2020 జూన్‌లో కేంద్ర ప్రభుత్వం షీ ఇన్‌తో పాటు చైనాకు చెందిన 58 యాప్‌లను నిషేధించింది. వీటి ద్వారా దేశ సార్వభౌమత్వం, సమగ్రత, రక్షణ, భద్రతలకు ముప్పు తలెత్తినట్లు కారణంగా చెప్పారు. తరువాత జాబితాను 270కి పెంచారు. షీ ఇన్ ప్రపంచంలో అతి పెద్ద ఆన్‌లైన్ ఫాషన్ దుస్తుల విక్రయాల కంపెనీ. 2022 ఏప్రిల్ నాటికి 150 దేశాల్లో దాని లావాదేవీల విలువ 100 బిలియన్ డాలర్లు. కంపెనీ ప్రధాన కార్యాలయం ఇప్పుడు సింగపూర్‌లో ఉంది కనుక గతంలో మన ప్రభుత్వం దానిపై విధించిన నిషేధం ఇప్పుడు వర్తించదని రిలయన్స్ దానితో ఒప్పందం చేసుకోవచ్చని, మన ప్రభుత్వం తిరిగి అనుమతించనున్నదని పత్రికలు రాశాయి. అసలు సంగతి ఏమంటే మరింతగా విస్తరించేందుకు, పన్నుల భారాన్ని తగ్గించుకొనేందుకు గాను తన ప్రధాన కార్యాలయాన్ని 2019లోనే చైనా నుంచి సింగపూర్‌కు మార్చుకుంది. 2020లో నిషేధం విధించేటపుడు అది చైనా కంపెనీ అని చూశారు తప్ప దాని ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉందని కాదు. రిలయన్స్ దానితో ఒప్పందం చేసుకోనుంది గనుక దాని వత్తిడి మేరకు సింగపూర్ పేరును ముందుకు తెచ్చారు. ఇప్పుడు విద్యుత్ వాహనాలు,పెట్టుబడులకు గేట్లు తెరిచారు. కార్పొరేట్లు రంగంలోకి దిగితే నరేంద్రమోదీ తనమాటలను తానే దిగమింగుతారు. కాషాయ మార్కు దేశభక్తి మరి !

సెల్ : 8331013288

మానవ హక్కుల వేదిక ఎనలేని పోరాటం

మానవ హక్కుల పరిరక్షణకోసం ప్రతి మనిషికి ఒకే విలువ కోసం 25 ఏళ్లు మానవ హక్కుల వేదిక కృషి చేసింది. కె.బాలగోపాల్ అధ్వర్యంలో హక్కుల రక్షణ కోసం ఎనలేని పోరాటమే జరిగింది. బాలగోపాల్ చేసిన కృషిని తెలియజేసేందుకు 37 నిమిషాల నిడివి గల షార్ట్ ఫిలిమ్‌ను గెడ్డం జ్యోతి నిర్మించారు. ఆ ఫిలిమ్‌ను ఈ నెల 7 వ తేదీ ఆదివారం విశాఖపట్నం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ప్రదర్శిస్తారు. మానవ హక్కుల వేదిక చేస్తున్న కార్యకలాపాలను వేదిక ఉభయ తెలుగు రాష్ట్రాల కమిటీ సభ్యులు విఎస్ కృష్ణ విశాలాంధ్రకు వివరించారు.

ప్రపంచంలోనే అపర కుబేరులూ, సరైన ఆహారంలేక చనిపోతున్న వారూ ఇక్కడే ఉన్నారు. లక్షల కోట్ల అప్పులు ఎగవేసి విదేశాలలో జల్సా చేస్తున్న వాళ్ళు కొందరు గిట్టుబాటు కాని వ్యవసాయంతో అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకొంటున్న రైతులు మరెందరో ఉన్నారు. అభివృద్ధి పేరుతో కార్పొరేట్లకు సహజ వనరులను గుత్తకివ్వడం, అదే వనరులపై ఆధారపడి బతుకుతున్న ఆదివాసీలను రైతులు నోరెత్తితే జైలుపాలు చేస్తున్నారు. చట్ట సభలలో నాల్గోవంతు పైగా తీవ్ర నేరాలు చేసిన సభ్యులు ఉండగా, జైళ్ళలో మగ్గుతున్న ఖైదీలలో మూడొంతులు పైగా విచారణ కూడా పూర్తి కాని బడుగు, బలహీనవర్గాల వారే ఉన్నారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పనకు బడ్జెట్ కేటాయింపులు నామ మాత్రంగానే ఉండగా, ప్రశ్నించే వారి గొంతులను నొక్కేస్తున్న పాలకుల విధానాలపై మానవ హక్కుల వేదిక 25 ఏళ్ళుగా ప్రశ్నిస్తూనే ఉంది.

విగ్రహాలకు, గుళ్ళకు, వీటి ప్రచారానికి మాత్రం వందల, వేల కోట్లు ఉన్నాయి. వైషమ్యాలను, విద్వేషాలను రెచ్చగొట్టిన వాళ్ళు అధికారంలోనూ, సామాన్య ప్రజల హక్కుల గురించి ప్రశ్నించిన వాళ్ళు జైళ్ళలో ఉన్నారు. ప్రకృతిని దైవంగా భావిస్తామని అంటారు కానీ, ప్రపంచంలో అత్యంత కలుషితమైన నదులు, నగరాలు మన దేశంలోనే ఉన్నాయి. స్త్రీలను పూజించే చోట దేవతలుంటారని నమ్ముతామంటూనే, రేపిస్టులకు సన్మానాలు చేస్తాం, పదవులు కట్టబెడతాము. వసుధైక కుటుంబం అని చెబుతాం, కానీ భిన్నత్వాన్ని సహించలేం. మెజారిటీకి భిన్నమైన ఆహారపు అలవాట్లపై, కట్టుబాట్లుపై, వారి ప్రేమపైన కూడ ఆంక్షలు పెడుతూ ఫాసిజానికి దారులు వేస్తున్న నేటి పాలకుల విధానాలపై గళమెత్తి ప్రశ్నిస్తున్నది మానవ హక్కుల వేదిక. 1970ల నుండి సాగిన హక్కుల ఉద్యమానికి హెచ్ఆర్ఎఫ్ ఉమ్మడి వారసురాలు. హక్కుల దృక్పథం మీద జరిగిన సుదీర్ఘమైన, విలువైన

కె.బాలగోపాల్

చర్చల పర్యావసానంగా 1998లో హెచ్ఆర్ఎఫ్ ఏర్పడింది. మానవ హక్కుల వేదిక ఒక విశాల దృక్పథంతో, స్వతంత్రంగా పనిచేసే హక్కుల సంస్థగా నిలబడి ఎదగడానికి వ్యవస్థాపక సభ్యులు వేసిన తాత్విక పునాదే కారణం. తొలినాళ్ళ నిర్బంధాన్ని, ఒత్తిళ్లను తట్టుకుంటూ తొలితరం కార్యకర్తలు చేసిన కృషి అపారమైంది, విలువల ఆధారంగా దగ్గరైన మనుషులు వాళ్ళు చేసేపని ద్వారా సమాజంలో హక్కుల సంస్కృతిని అభివృద్ధి చేస్తూ, వేళ్ళూనుకుని ఉన్న అనేక రకాల అసమానతలను, ఆధిపత్యాన్ని, అణచివేతలను ఏదో మేరకు తగ్గించే దిశగా కృషి చేయగలరని మానవ హక్కుల వేదిక ప్రయాణం గమనిస్తే అర్థమౌతుంది. రాజ్యం, కులం, మతం, వర్గం, హిందుత్వ, జెండర్, లైంగికత తదితర ఆధిపత్య వ్యవస్థల వలన అణచివేతకు గురౌతున్న అనేక ప్రజా సమూహాలకు మానవ హక్కుల వేదిక మద్దతుగా నిలబడింది. తెలుగు రాష్ట్రాలలో దళితులు, ముస్లింలు, మహిళలపై దాడులు జరిగిన అనేక సంఘటనలలో క్షేత్రస్థాయిలో నిజ నిర్ధారణలు చేబట్టి బాధితులకు బాసటగా నిలిచామన్నారు. గృహహింస బాధితులకు న్యాయ తోడ్పాటు తరుచుగా అందించామన్నారు. అభివృద్ధి పేరుమీద జరిగే విధ్వంసంతో ఎవరు నష్టపోతున్నారో, ఎవరు లాభ పడుతున్నారో తేటతెల్లం చేశామని, పోలవరం, వంశధార, గండికోట, అన్నమయ్య రిజర్వాయర్లు, కాకినాడ సెజ్, పిసిపిఐఆర్, తుమ్మలపల్లి యురేనియం తదితర ప్రాజెక్ట్ స్థాపనవల్ల బాధితుల పక్షాన నిలబడ్డామన్నారు. అలాగే సోంపేట, మన్యం బాక్సైట్, వేదాంత ఫ్రాకింగ్ లాంటి ప్రాజెక్టులను నిలువరించడానికి స్థానిక ప్రజలతో మానవ హక్కులవేదిక భాగస్వామి అయిందన్నారు. నదీ జలాల పంపకాలలో అవలంబించాల్సిన ప్రజాస్వామిక విధానాల గురించి విస్తృత స్థాయిలో పని చేశామన్నారు.

డెల్టా జిల్లాలలో ఆక్వా కల్చర్, గోదావరి, విశాఖపట్నం లాంటి తీర ప్రాంతాలలో పర్యాటకం, చమురు, సహజ వాయువు తవ్వకాలు, థర్మల్, అణు విద్యుత్తు కేంద్రాలు, వివిధ జిల్లాలలో భారీ స్థాయి కాలుష్య కారక పరిశ్రమలు, అటవీ ప్రాంతాలలో మైనింగ్ తదితర ప్రాజెక్ట్ కారణంగా జరిగే పర్యావరణ విధ్వంసం గురించి అవగాహన కల్పించి, పర్యావరణాన్ని కాపాడుకోవటానికి జరిగిన ప్రయత్నాలలో మూలము అయ్యామన్నారు.

ఎన్‌కౌంటర్లు, లాకప్ మరణాలు, పోలీసు వేధింపుల సంఘటనలలో నిజానిజాలు వెలుగులోకి తెచ్చామని, వాకపల్లి కేసులో బాధిత ఆదివాసీ మహిళలతో పాటు వెన్నంటి నిలబడ్డామన్నారు. చుండూరు, లక్షింపేట, వెంకటాయపాలెం శిరోముండనం కేసులలో బాధితులతో కలిసి న్యాయంకోసం నినదించామని, సంక్షేమ హాస్టళ్ల నిర్వహణలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపామని, తమ ప్రాంతాల్లో ఉన్న తాగునీటి, ఆరోగ్య సమస్యలు, ఫారెస్టు అధికారుల వేధింపులపై ఆదివాసీలతో కలిసి పనిచేసామన్నారు. తమ న్యాయమైన హక్కుల కోసం పోరాడుతున్న మున్సిపల్ కార్మికులు, అంగన్వాడీలు, అసంఘటిత కార్మికులకు మద్దతుగా ఉన్నామని, వ్యవసాయం గిట్టుబాటు కాక ఆత్మహత్యలు చేసుకున్న అనేక రైతు కుటుంబాలకు ప్రభుత్వం కనీసం నష్టపరిహారం ఇవ్వకపోవడాన్ని వెలుగులోనికి తెచ్చామన్నారు. కశ్మీర్, గుజరాత్ మారణకాండ, సాల్వ జుడుం, పౌరసత్వ చట్టం ఉద్యమం, రైతుల ఉద్యమం, హిండెన్‌బర్గ్ ఉదంతం, మణిపూర్‌లో హింస తదితర దేశవ్యాప్త అంశాలపై తమ వైఖరిని కరపత్రాలు, పత్రికా ప్రకటనలు, పుస్తకాలు, సభలు, సమావేశాల ద్వారా తెలియజేశామన్నారు. సమాచార హక్కు, ఉపాధి హామీ వంటి చట్టాలను నిలబెట్టుకోవాలని ప్రచారం చేశామని, కళాశాల విద్యార్థులలో హక్కుల అవగాహన పెంచే కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రభుత్వం చేసే చట్టాలు, అవలంబిస్తున్న విధానాలు ఎవరి ప్రయోజనాలను కాపాడుతున్నాయో ఎస్‌సీ, ఎస్‌టీ అత్యాచారాల నిరోధక సవరణ చట్టం, అటవీ హక్కుల సవరణ చట్టం, ఈడబ్ల్యుఎస్, ఆర్టికల్ 370 రద్దు, నోట్లరద్దు, రామ జన్మభూమి తీర్పు తదితర సందర్భాలలో స్పష్టంగా తెలియజేశామన్నారు. ఉపా, దేశద్రోహం లాంటి చట్టాల రద్దుకు పోరాడమన్నారు. మానవ సంబంధాలన్నీ విచ్ఛిన్నం అయిపోతున్నాయని, ప్రజాస్వామ్యానికి అత్యవసరమైన సంవాదం, చర్చ మాయమైపోయాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో "ప్రతి మనిషికి ఒకే విలువ" అనే ప్రజాస్వామిక భావనను వ్యాప్తి చేయాల్సిన బాధ్యత ప్రజాస్వామిక వాదులందరి పైన ఉందన్నారు.

- రామకృష్ణ పంపన, సెల్: 9848079037

విశాలాంధ్ర
సమరాంగణం 2024
శనివారం 06, ఏప్రిల్ 2024

71 వేల అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతు

ఎన్నికల డిపాజిట్

ప్రజా ప్రతినిధుల చట్టం (1951 ప్రకారం సెక్షన్ 34 1(ఎ) ప్రకారం ఎన్నికల బరిలో దిగే అభ్యర్థి తప్పనిసరిగా కొంత మొత్తాన్ని ఎన్నికల డిపాజిట్ రూపేణ చెల్లించాలి. సరదా నామినేషన్ల నివారణకే ఈ నిబంధన రూపొందింది. ప్రజా మద్దతు ఉండి ఎన్నికల్లో పోటీ చేయాలని కృతనిశ్చయంతో ఉన్న అభ్యర్థులకు హామీ కోసం డిపాజిట్ దోహదమవుతుంది.

ఎంత కట్టాలి...

పార్లమెంటరీ ఎన్నికలకు రూ.25,000

అసెంబ్లీ ఎన్నికలకు రూ.10,000

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలకు రూ.15,000

శాతం	సంవత్సరం	అభ్యర్థుల సంఖ్య	కోల్పోయిన డిపాజిట్
86%	2019	8,026	6,897
85%	2014	8,251	7,000
85%	2009	8,070	6,829
78%	2004	5,435	4,218
73%	1999	4,648	3,400
73%	1998	8,026	8,026
91%	1996	13,952	12,688
86%	1991	8,668	7,486
81%	1989	6,160	5,003
80%	1984	5,312	4,263
74%	1980	4,629	3,414
56%	1977	2,439	1,356
61%	1971	2,784	1,707
51%	1967	2,369	1,203
43%	1962	1,985	856
33%	1957	1,519	494
40%	1951	1,874	745

డిపాజిట్ గల్లంతయ్యేదెప్పుడు...

ఒక అభ్యర్థికి తన నియోజకవర్గంలో 16.66 శాతం లేదా ఆరో వంతు ఓట్లు రాకపోతే ఆమె/అతను కట్టిన డిపాజిట్ గల్లంతవుతుంది. ఆ మొత్తం ఖజానాకు మళ్లుతుంది. అలాగే అభ్యర్థి గెలిచినప్పుడు లేదా ఆరో వంతుకుపైగా ఓట్లు సాధించనప్పుడు లేదా నిర్దేశిత తేదీ కంటే ముందు నామినేషన్ ఉపసంహరించుకున్నప్పుడు లేదా చనిపోయినప్పుడు మాత్రం డిపాజిట్లు కోల్పోయే పరిస్థితి ఉండదు.

ఎంత మంది డిపాజిట్లు కోల్పోయారంటే...

ఎన్నికల సమరంలో డిపాజిట్లు కోల్పోవడాన్ని అగౌరవంగా...వాటిని కాపాడుకోగలిగితే గౌరవంగా భావిస్తారు. 1951 నుంచి 2019 వరకు 91,160మందిలో నుంచి 71,245 మంది డిపాజిట్లు గల్లంతయ్యాయి. ఈ మేరకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) డేటా చెబుతోంది. అంటే కట్టిన డబ్బును భద్రంగా ఉంచుకోవడంలో 78 శాతం మంది విఫలమయ్యారు.

1996లోనే అధికం...

- 1996లో రికార్డు స్థాయిలో డిపాజిట్లు గల్లంతయ్యాయి. 13,952 మంది అభ్యర్థుల్లో 12,688 మంది (91శాతం) తమ డిపాజిట్లు కోల్పోయారు. అయితే అధిక సంఖ్యలో అభ్యర్థులు పోటీ చేసిన సంవత్సరం కూడా అదే.
- 1957లో రెండవ లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. అప్పట్లో కేవలం 33శాతం మంది తమ డిపాజిట్లు కోల్పోయారు. 1,519 మంది పోటీ చేయగా 494 మంది డిపాజిట్లు గల్లంతయ్యాయి.
- 2019 సార్వత్రిక ఎన్నికల్లో 1,454 మందిలో నుంచి 670 మంది డిపాజిట్లు కోల్పోయారు. 3,443 మంది స్వతంత్ర అభ్యర్థులుగా తమ అదృష్టాన్ని పరీక్షించుకోగా 3,431 మంది డిపాజిట్లు గల్లంతయ్యాయి.

డిపాజిట్‌లో రాయితీ

- ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 50శాతం రాయితీ ఉంటుంది.
- తొలి పార్లమెంటరీ ఎన్నికలు 1951లో జరిగాయి. అప్పట్లో రూ.500 కట్టించుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల కోసం రూ.100ను అభ్యర్థులు చెల్లించారు.
- 2009లో అప్పటి ప్రభుత్వం ఎన్నికల డిపాజిట్ మొత్తాన్ని రెట్టింపు చేసింది. రూ.12,500 నుంచి రూ.25,000కు పెంచింది. అసెంబ్లీ ఎన్నికల కోసం కట్టాల్సిన మొత్తాన్ని రూ.5వేల నుంచి రూ.10వేలు చేసింది.

266 లోక్‌సభ స్థానాల్లో ఓట్ల శాతం పెంపునకు ఈసీ చర్యలు

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఈసీ చర్యలు తీసుకుంటోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో తక్కువ పోలింగ్ నమోదైన 266 స్థానాలు గుర్తించింది. తెలంగాణ సహా ఆయా రాష్ట్రాల్లోనూ జాతీయ సగటు (67.40) కంటే తక్కువ పోలింగ్ నమోదైంది. దీంతో ఈసారి అక్కడ ఓట్ల శాతాన్ని పెంచడమే లక్ష్యంగా ఈసీ ముందడుగు వేస్తోంది. సంబంధిత నియోజకవర్గాల సిబ్బందితో శుక్రవారం ఢిల్లీలో సమావేశమైన ఈసీ అధికారులు... ఓటరు భాగస్వామ్యాన్ని పెంచేందుకు వ్యూహరచన చేశారు. 2019లో తెలంగాణ, బీహార్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, గుజరాత్, పంజాబ్, రాజస్థాన్, జమ్మూకశ్మీర్, జార్ఖండ్‌లలో పోలింగ్ శాతం... జాతీయ సగటు 67.40 శాతంతో పోలిస్తే తక్కువగా నమోదైంది. మొత్తం 266 నియోజకవర్గాల్లో తక్కువ ఓటింగ్ నమోదు కాగా... వాటిలో 215 గ్రామీణ, 51 పట్టణ ప్రాంత స్థానాలు ఉన్నాయి. పోలింగ్ శాతం పెంపు విషయంలో దేశంలోని అన్ని ప్రాంతాలకూ ఒకే విధమైన వ్యూహం పనిచేయదని, సంబంధిత నియోజకవర్గాలకు అనుగుణంగా రూపొందించాలని భారత ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్‌కుమార్ సూచించారు. ప్రజలే స్వయంగా ముందుకొచ్చి ఎన్నికల ప్రక్రియలో భాగమయ్యే వాతావరణం సృష్టించాల్సిన అవసరం ఉందని సీఈసీ చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాల కల్పన, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్, ఇన్‌ఫ్లుయెన్సర్లను భాగస్వామ్యం చేయడం వంటి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల ఉదాసీనతపై రూపొందించిన ఓ బుక్‌లెట్‌ను విడుదల చేశారు. లాజిస్టికల్ కార్యకలాపాల క్రమబద్ధీకరణ, ఓటర్లలో అవగాహన పెంచేందుకు ఉద్దేశించిన 'సిస్టమాటిక్ ఓటర్ ఎడ్యుకేషన్-ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రామ్ తదితర అంశాలపై చర్చలు జరిపారు.

నాకెందుకు టికెట్ ఇవ్వలేదు

ఏడ్చేసిన పప్పూయాదవ్

పాట్నా: బీహార్ రాజకీయాల్లో సంచలనంగా నిలిచిన పప్పూయాదవ్‌కు ఈసారి టికెట్ లభించలేదు. పూర్ణియా లోక్‌సభకు ఆయన అనేకసార్లు ఎంపీగా ప్రాతినిధ్యం వహించారు. తనకు టికెట్ దక్కకపోవడంతో భావోద్వేగానికి గురయ్యారు. ఏకంగా గుక్కపట్టి ఏడ్చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన అనంతరం తన మద్దతుదారులను ఉద్దేశించి మాట్లాడారు. మాజీ ఎంపీ రాజేశ్ రంజన్ అలియాస్ పప్పూయాదవ్... పూర్ణియా నియోజకవర్గం నుంచి ఎంపీ టికెట్ ఆశించారు. ఇటీవల తన పార్టీ జన్ అధికార్ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసినా ప్రయోజనం దక్కలేదు. ఆర్జేడీ-కాంగ్రెస్ పొత్తులో భాగంగా లాలూ ప్రసాద్ యాదవ్ పార్టీ పూర్ణియా నుంచి భీమా భారతిని రంగంలోకి దించింది. ఈ నిర్ణయం పప్పూ యాదవ్‌ను తీవ్రంగా బాధించింది. దాంతో ఆ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఆయన నామినేషన్ వేశారు. తనకు పదేపదే ఎందుకు టికెట్ నిరాకరిస్తున్నారని ఆయన ఉద్వేగంగా మాట్లాడారు. ఆర్జేడీ అగ్రనేతలు లాలూతో పాటు ఆయన కుమారుడు తేజస్వీ యాదవ్‌పై విమర్శలు చేశారు. తేజస్వి వెంటరాగా... పూర్ణియా స్థానానికి భీమా భారతి నామినేషన్ వేశారు. దీనిపైనాఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో గతంలో ఏనాడు అభ్యర్థి వెంట తేజస్వి రాలేదని, ఇప్పుడు తనకు వ్యతిరేకంగా పోటీ చేస్తోన్న అభ్యర్థి కోసం వచ్చారని మండిపడ్డారు. ఏడాది కాలంగా పూర్ణియా కోసం పనిచేస్తున్న తనకు దక్కిన గౌరవం ఇదేనా అని అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా, పొత్తులో భాగంగా ఇప్పటికే అభ్యర్థులు ఖరారయ్యారని కాంగ్రెస్ స్పష్టం చేసింది. పప్పూ యాదవ్ తమ పార్టీ అభ్యర్థి కాదని, తమ మద్దతు ఆర్జేడీ అభ్యర్థికేనని స్పష్టం చేసింది.

సిక్కిం అసెంబ్లీ బరిలో

12 మంది మహిళలే!

గ్యాంగ్‌టక్: సిక్కింలో దాదాపు 50 శాతం ఓటర్లు మహిళలే ఉన్నప్పటికీ హిమాలయ రాష్ట్రంలోని ఏకైక లోక్‌సభ స్థానానికి, అలాగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల బరిలో 146 మంది అభ్యర్థుల్లో 12 మంది మాత్రమే మహిళా అభ్యర్థులు ఉన్నారు. సిక్కింలో 32 అసెంబ్లీ స్థానాలు, ఒక లోక్‌సభ నియోజకవర్గం ఉన్నాయి. ఏప్రిల్ 19న అసెంబ్లీ, లోక్‌సభ స్థానానికి పోలింగ్ జరగనుంది. రాష్ట్రంలో 4.66 లక్షల మంది ఓటర్లు ఉండగా అందులో 2.31 లక్షల మంది మహిళలు ఉన్నారు. సిక్కిం ప్రస్తుత శాసనసభలో ముగ్గురు మహిళా ఎమ్మెల్యేలు... వారిలో మెల్లి నుంచి ఫర్వంతి తమాంగ్, రంగంగ్ యాంగ్‌గాంగ్ నుంచి రాజ్‌కుమారి థాపా, జూమ్-సల్ఘరి (ఎస్సీ) నుంచి సునీతా గజ్మేర్ ఉన్నారు. గత రాష్ట్ర అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో 15 మంది మహిళా అభ్యర్థులు బరిలో నిలిచారు. అధికార సిక్కిం క్రాంతికారి మోర్చా (ఎస్‌కేఎం) నలుగురు మహిళా అభ్యర్థులను రంగంలోకి దించింది. 2019 ఎన్నికల్లో ఆ పార్టీ ముగ్గురు మహిళా అభ్యర్థులను నిలబెట్టింది. ఎస్‌కేఎం మహిళా అభ్యర్థుల్లో ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమాంగ్ భార్య కృష్ణ కుమార్ రాయ్ ఉన్నారు. ఆమె నామ్చి-సింఘితాంగ్ నుంచి పోటీలో ఉండగా, ఇటీవలే బీజేపీ నుంచి అధికార పార్టీలో చేరిన సిట్టింగ్ ఎమ్మెల్యే రాజ్‌కుమారి థాపా రంగాంగ్-యాంగాంగ్ నుంచి బరిలోకి దిగారు. బీజేపీ అధ్యక్షుడు, సిట్టింగ్ ఎమ్మెల్యే డి.ఆర్.థాపాపై ఎస్‌కేఎం కళావతి రాయ్‌ను అప్పర్ బర్తుక్ నుంచి బరిలోకి దించింది. పామిన్ లెప్చా గ్నాతంగ్-మచోంగ్ (బీఎల్) నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు.

మరో ప్రాంతీయ సంస్థ, సిటిజన్ యాక్షన్ పార్టీ (సీఏపీ-సిక్కిం) కూడా

నలుగురు మహిళా అభ్యర్థులను నిలబెట్టగా, బీజేపీ, కాంగ్రెస్ ఇద్దరేసి మహిళా అభ్యర్థులకు టికెట్లు ఇచ్చాయి. ప్రముఖ ప్రతిపక్ష పార్టీ సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎస్‌డీఎఫ్) ఈసారి ఎన్నికల్లో ఒక్క మహిళా అభ్యర్థిని కూడా నిలబెట్టలేదు. 2019 ఎన్నికల్లో ఎస్‌డీఎఫ్ నలుగురు మహిళా అభ్యర్థులకు టికెట్లు ఇవ్వగా, వారిలో ఇద్దరు ఎన్నికల్లో విజయం సాధించారు. 14 మంది అభ్యర్థులు బరిలో ఉన్న సిక్కింలోని ఏకైక లోక్‌సభ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా మహిళ బీనా రాయ్ పోటీ చేస్తున్నారు. దిల్ కుమారి భండారీ సిక్కిం లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించిన చివరి మహిళ (1991-96).

ఆ సినిమా ప్రదర్శన ఆపేయండి

విజయన్



తిరువనంతపురం: వివాదాస్పదమైన 'ది కేరళ స్టోరీ' సినిమాపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. సినిమా ప్రసారం చేయాలనే దూరదర్శన్ నిర్ణయాన్ని ఆయన వ్యతిరేకించారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈ నిర్ణయం మత ఉద్రిక్తతలను రేకెత్తిస్తుందని హెచ్చరించారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లకు ప్రచార మాధ్యమంగా దూరదర్శన్ మారవద్దని సూచించారు. విద్వేషాలు, రెచ్చగొట్టే ప్రయత్నాలు విరమించుకోవాలని కోరారు. దురుద్దేశపూరిత ఆలోచనలు, నిర్ణయాలను వ్యతిరేకించడంలో కేరళ ప్రభుత్వం ఎప్పుడూ ముందే ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కేరళలో బీజేపీ పట్టు నిలుపుకునేందుకు ఈ వివాదాస్పద చిత్రాన్ని తెర మీదకు తీసుకువచ్చిందని మండిపడ్డారు. సినిమా విడుదలైనప్పుడు కేరళలో తీవ్ర నిరసనలు చెలరేగాయి. సినిమా నుంచి సెన్సార్ బోర్డు స్వయంగా 10 సన్నివేశాలు తొలగించింది. సినిమా ట్రైలర్‌లో ఏ ఒక్క వర్గానికి అభ్యంతరం కలిగించే అంశాలు లేవని పేర్కొంటూ సినిమా విడుదలపై స్టే విధించేందుకు గతేడాది కేరళ హైకోర్టు నిరాకరించడం గమనార్హం. ది కేరళ స్టోరీ ట్రైలర్‌లో కేరళకు చెందిన 32 వేల మంది మహిళలు మతం మారారని, వారు తీవ్రవాదులుగా మారి భారత్ సహా ప్రపంచ దేశాల్లో విధ్వంసాలకు పాల్పడ్డారని చూపించారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు భగ్గుమన్నాయి. 2023లో ఈ చిత్రం విడుదల కాగా సీపీఐ(ఎం), కాంగ్రెస్ తీవ్ర నిరసనలు తెలిపాయి. సినిమా ప్రదర్శనలను ఆపివేయాలని డిమాండ్ చేశాయి.

భారత తొలి ప్రధాని బోస్

కంగన వ్యాఖ్యల దుమారం

న్యూఢిల్లీ: భారత తొలి ప్రధాని నేతాజీ సుభాశ్ చంద్రబోస్ అని నటి, మండి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలు నెట్టింట్లో వైరల్‌గా మారాయి. ఒక ఇంటర్వ్యూలో కంగన మాట్లాడుతూ మనకు స్వాతంత్ర్యం వచ్చినప్పుడు తొలి ప్రధాని బోస్ ఎక్కడికి వెళ్లారన్నారు. దేశం కోసం పోరాడిన ఆయనను దేశంలోకి అడుగుపెట్టనివ్వలేదని చెప్పారు. అయితే వ్యాఖ్యాత ఆమె మాటలను సరిచేశారు. కంగన ప్రకటనపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తాయి. ఇలాంటి వారి మాటలు తేలిగ్గా తీసుకోవద్దని, వీరంతా ఎక్కడ చదువుకున్నారని విపక్ష నేతలు, నెటిజన్లు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆమె విద్యాశాఖ మంత్రి అయితే పరిస్థితి ఏమిటని కామెంట్లు పెట్టారు. గతంలోను ఈ నటి ఇదేతరహా వ్యాఖ్యలు చేశారు. 2014లో మోదీ ప్రధాని అయిన తర్వాతే దేశానికి అసలైన స్వాతంత్ర్యం వచ్చిందని వ్యాఖ్యలు చేసి... విమర్శల పాలయ్యారు. ఆమెపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని అప్పట్లో కొంతమంది నేతలు డిమాండ్ చేశారు.

కేజ్రీవాల్, సిసోదియా అమాయకులు

ఎంపీ సంజయ్ సింగ్

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో జైలులో ఉన్న ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోదియా అమాయకులని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ అన్నారు. జైలు నుంచే ఆప్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని చెప్పారు. మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో మార్చి 21న కేజ్రీవాల్ అరెస్టు కాగా, ఇదే కేసులో అరెస్టయిన సంజయ్ సింగ్ ఇటీవల బెయిలుపై విడుదలయ్యారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో తప్పుడు సాక్ష్యాలతోనే కేసులు నమోదు చేసినట్టు సంజయ్ సింగ్ ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలిపారు. బెయిలు పొందడంలో జాప్యం ఎందుకు జరుగుతోందని అడిగినప్పుడు లీగల్ ప్రక్రియలో అదొక భాగమని, పీఎంఎల్‌ఏ చట్టం కింద బెయిల్ లభించడం ఓ రకంగా కష్టమని చెప్పారు. కేసు విచారణలో ఉన్నందున ఇంతకంటే ఎక్కువ మాట్లాడలేనని చెప్పారు. కేజ్రీవాల్‌పై కేసుకు సంబంధించి మాట్లాడుతూ ఈడీ, సీబీఐ మొత్తం 456 సాక్షులు ఇచ్చిన వాంగ్మూలాలు రికార్డు చేశాయని, కేవలం నలుగురే సీఎం పేరును ప్రస్తావించారన్నారు. కేజ్రీవాల్ నీతివంతమైన జీవితాన్ని గడిపే వ్యక్తి అని, పిల్లలకు ఉత్తమ విద్య, ఢిల్లీ ప్రజలకు చక్కటి ఆరోగ్య సౌకర్యాలు కల్పించడమే ఆయన లక్ష్యమని చెప్పారు. జైలు నుంచి ప్రభుత్వాన్ని నడపడంపై అడిగినప్పుడు... ఎందుకు పాలన సాగించరాదని ప్రశ్నించారు.

బీజేపీపై వ్యాఖ్యలకు వివరణ ఇవ్వండి

అతిశికి ఈసీ నోటీసులు

న్యూఢిల్లీ: బీజేపీలో చేరమని ఆ పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు తనను సంప్రదించారంటూ ఆప్ నేత, ఢిల్లీ ఆర్థికశాఖ మంత్రి అతిశి చేసిన వ్యాఖ్యలను ఎన్నికల సంఘం (ఈసీ) సీరియస్‌గా తీసుకుంది. ఈ మేరకు ఆమెకు షోకాజ్ నోటీసులు పంపింది. ఈ అంశంలో తాను చేసిన ప్రకటనకు సరైన ఆధారాలు చూపించాలని కోరింది. 'బీజేపీకి చెందిన కొందరు తమ పార్టీలో చేరమని నన్ను సంప్రదించారు. ఈ ప్రతిపాదనను నేను తిరస్కరించాను' అని అతిశి కొద్దిరోజుల క్రితం సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనిపై బీజేపీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఆప్ నేత వ్యాఖ్యలపై వివరణ కోరాలని అభ్యర్థించింది. ఈ నేపథ్యంలోనే అతిశికి నోటీసులు జారీ అయ్యాయి.

ఈసీ బీజేపీ అనుబంధ సంస్థగా మారింది: అతిశి

ఎన్నికల సంఘం షోకాజ్ నోటీసులపై ఢిల్లీ మంత్రి అతిశి స్పందిస్తూ... బీజేపీకి ఎన్నికల సంఘం ఓ అనుబంధ సంస్థగా మారిందని ఆరోపించారు. తనకు నోటీసులు రావడానికి గంట ముందే మీడియాకు ఈ విషయం ఎలా తెలిసిందని ఆమె ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు కేజ్రీవాల్ అరెస్ట్, కాంగ్రెస్ బ్యాంకు ఖాతాల స్తంభనపై ఈసీ ఎందుకు స్పందించలేదని నిలదీశారు. బీజేపీ అభ్యంతకర పోస్టర్లు, హోర్డింగ్‌లపై తాము అనేక సార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఈసీ పంపిన నోటీసులకు తాను సమాధానం ఇస్తానని ఆమె చెప్పారు.

ఈసీ నోటీసులో ఏముందంటే?

'మీరు ఢిల్లీలో అధికారంలో ఉన్న ఒక జాతీయ పార్టీకి నాయకురాలు. పైగా మంత్రి. అలాంటి సమయాల్లో మీలాంటి వారు మీడియా ముందు లేదా బహిరంగ వేదికల నుంచి ఏం చెప్పినా ఓటర్లు నమ్ముతారు. మీ ప్రసంగాల్లో చేసే ప్రకటనలు వారిని ప్రభావితం చేస్తాయి. అయితే బీజేపీలో చేరిక విషయంలో మీరు చేసిన వ్యాఖ్యలను సమర్థించుకోవాలని, అందుకు తగిన ఆధారాలు మీ వద్ద ఉన్నాయని మేం భావిస్తున్నాం. వాటిని ఈసీకి అందించాలని కోరుతున్నాం' అని ఎన్నికల సంఘం నోటీసులో పేర్కొంది. కాగా, ఏప్రిల్ 8 సోమవారం మధ్యాహ్నానికి మంత్రి అతిశి ఈసీకి సమాధానం ఇవ్వాల్సి ఉంది.

పింఛన్ల పంపిణీలో డ్రామాలు

- మతోన్మాద బీజేపీని సాగనంపుదాం
- 'ఇండియా' అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-పత్తికొండ: వృద్ధుల, వికలాంగుల, వితంతువుల పెన్షన్ల పంపిణీలో రాజకీయ డ్రామాలు చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. కర్నూలు జిల్లా పత్తికొండలో చదువుల రామయ్య భవనం ఆవరణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఎన్నికల సన్నాహక సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. తొలుత నాలుగు స్తంభాల మండపం దగ్గర రామకృష్ణకు ఇండియా కూటమి శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. అక్కడి నుండి చదువుల రామయ్య భవనం వరకు ర్యాలీ జరిగింది. ఎన్నికల సన్నాహక సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ తాజా సార్వత్రిక ఎన్నికలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. బీజేపీకి మరోసారి అధికారమివ్వాలని ప్రధాని నరేంద్రమోదీ ప్రజలను మభ్య పెడుతున్నారని, బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్నే మార్చివేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. 2014కు ముందు మోదీ అనేక హామీలు గుప్పించారని, అధికారం చేపట్టి పదేళ్లయినా ఒక్క హామీ అమలు చేయలేదని రామకృష్ణ విమర్శించారు. మనది లౌకిక దేశమని, మతాల మధ్య చిచ్చుపెడుతూ ఓట్లు దండుకునేందుకు ప్రధాని మోదీ కుట్రలు చేస్తున్నారన్నారు. దేశానికి అత్యంత ప్రమాదకారి మోదీతో ప్రత్యక్షంగా తెలుగుదేశం పార్టీ, పరోక్షంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ

అంటకాగడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఒక్క శాతం ఓట్లు లేని బీజేపీకి ఆరు పార్లమెంటు, పది అసెంబ్లీ స్థానాలను కేటాయించడం టీడీపీ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. మోదీ విధానాలను ప్రశ్నిస్తున్న విపక్ష పార్టీల నేతలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐ, ఐటీలను ప్రయోగించి...బెదిరింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఆమ్ ఆద్మీ, ఇతర పార్టీలు ఇండియా కూటమిగా ఏర్పడితే మోదీకి భయం పట్టుకుందని, అందుకే మద్యం కేసు సాకుతో ఆప్ అధినేత, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను తీహార్ జైలుకు పంపారని విమర్శించారు. సీఎం జగన్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారన్నారు. మద్య నిషేధమని చెప్పి...ఆ పని చేయకపోగా అదే మద్యంపై వేల కోట్ల రూపాయలు సంపాదించారని విమర్శించారు. అసెంబ్లీలో కమ్యూనిస్టులు లేకపోవడంతో ప్రజా సమస్యలపై చర్చ జరగడం లేదని, బూతు పురాణాలతోనే కాలం వెల్లదీస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళం వినిపించేందుకు కమ్యూనిస్టులను గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఇండియా కూటమి బలపరుస్తున్న పత్తికొండ అసెంబ్లీ నియోజకవర్గ సీపీఐ అభ్యర్థిగా పి.రామచంద్రయ్య, కర్నూలు పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా రాం పుల్లయ్య యాదవ్ ఎన్నికల బరిలో ఉన్నారని, వారి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, ఆవుల శేఖర్, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి రాం పుల్లయ్య యాదవ్, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.జగన్నాథం, నబీ రసూల్, రంగన్న, రామకృష్ణారెడ్డి, కారుమంచి, పంపన్న గౌడ్, సీపీఐ తుగ్గలి, కృష్ణగిరి, మద్దికెర, వెల్దుర్తి మండల కార్యదర్శులు సుల్తాన్, ఖలీల్, నాగరాజు, కృష్ణ, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా సమితి సభ్యులు సురేంద్ర కుమార్, కారన్న, తిమ్మయ్య, కృష్ణయ్య, పెద్ద ఈరన్న, బొంతిరాళ్ల సర్పంచ్ రవి మోహన్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరామడు, నాగరాజు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీపీఐకి రూ.10 వేల పెళ్లి కానుక

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం పత్తికొండ నియోజకవర్గ అధ్యక్షుడు యర్రం వెంకట్రామిరెడ్డి కుమారుడు వై.సూర్య జయప్రకాశ్‌రెడ్డి-నిఖిల వివాహ వేడుకకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె .రామకృష్ణ శుక్రవారం హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి... పెళ్లికానుకగా సీపీఐ రాష్ట్ర సమితికి రూ.10 వేలు విరాళంగా ఇచ్చారు. చెక్కును రామకృష్ణకు అందజేశారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నభిరసూల్, సీపీఐ తుగ్గలి మండల కార్యదర్శి సుల్తాన్ ఉన్నారు.

దళిత జనబాంధవుడు జగ్జీవన్‌రామ్: జల్లి విల్సన్

విశాలాంధ్ర-విజయవాడ: దళితులు ఎదుర్కొంటున్న సామాజిక వివక్షతను ఎదిరించి కడవరకు పోరాడిన ధీశాలి బాబూ జగ్జీవన్‌రామ్ అని మాజీ ఎమ్మెల్సీ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జల్లి విల్సన్ అన్నారు. జగ్జీవన్‌రామ్ 116వ జయంతిని పురస్కరించుకుని స్థానిక శిఖామణి సెంటర్‌లో జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహానికి దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్పతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జల్లి విల్సన్ మాట్లాడుతూ భారత మాజీ ఉపప్రధానిగా, హోం మంత్రిగా వివిధ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తించటమే కాకుండా దళితులపై దాడులు జరిగినప్పుడు ప్రభుత్వంలో ఉండి కూడా సమస్యలను పరిష్కరించటానికి ధైర్యంగా నిలబడి బాధితులకు న్యాయం చేయటానికి పరితపించిన మహనీయుడన్నారు. జగ్జీవన్‌రామ్... బీహార్‌లోని బాంద్వా గ్రామంలో 1908లో జన్మించారని, తీవ్రమైన కుల వివక్షతను ఎదుర్కొంటూనే అమానవీయ ఆంక్షలను ఎదిరించి తిరుగుబాటు బావుటా ఎగురవేశారని కొనియాడారు. చదువుకునే రోజుల్లో అంటరాని దురాచారాన్ని ఎదిరించి అభ్యుదయవాదుల్లో ఆలోచన కలిగించి ఉద్యమాల నిర్మాతగా ఎదిగారని చెప్పారు. జగ్జీవన్‌రామ్ పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శమని, ఆయన అడుగుజాడల్లో నడవటం మన కర్తవ్యమని జల్లి విల్సన్ ఉద్బోధించారు. డీహెచ్‌పీఎస్ నగర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొడాలి ఆనందరావు, బీ సుశాంత, పి.భాను, కాటుమాల జోసెఫ్, సీపీఐ నాయకుడు లక్ష్మణరావు, ప్రసన్న పాల్గొన్నారు.

మాల్దీవులకు నిత్యావసరాల ఎగుమతి

న్యూదిల్లీ: భారత్-మాల్దీవుల మధ్య గత కొంత కాలంగా మాటల యుద్ధం సాగుతున్న సంగతి విదితమే. అయితే భారత్ మానవతా సాయంగా నిత్యావసర వస్తువులను ఆ దేశానికి ఎగుమతి చేయడానికి ముందుకొచ్చింది. మాల్దీవులకు చక్కెర, గోధుమలు, బియ్యం, ఉల్లిపాయలతో సహా నిత్యావసర వస్తువులను పరిమిత స్థాయిలో ఎగుమతి చేయడానికి కేంద్రం పచ్చజెండా ఊపింది. ఏప్రిల్ 1న ప్రారంభమైన 2024-25 ఆర్థిక సంవత్సరంలో మాల్దీవులకు ఈ వస్తువుల ఎగుమతులపై ఉన్న నిషేధం నుంచి మినహాయింపు ఇచ్చినట్లు కేంద్రప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.దీంతో మాల్దీవులకు 1,24,218 మెట్రిక్ టన్నుల బియ్యం, 1,09,162 టన్నుల గోదుమ పిండి, 64,494 టన్నుల చక్కెర, 21,513 మెట్రిక్ టన్నుల బంగాళదుంపలు, 35,749 టన్నుల ఉల్లిపాయలు, 427.5 మిలియన్ కోడిగుడ్లను ఎగుమతి కానున్నాయి. అలాగే ఒక మిలియన్ టన్నుల కంకర రాయి, నది ఇసుకను ఎగుమతి చేయడానికి కూడా కేంద్రం అనుమతి తెలిపింది.

దూరదర్శన్ మొదటి న్యూస్ రీడర్
శాంతి స్వరూప్ మృతి

విశాలాంధ్ర-హైదరాబాద్: దూరదర్శన్ మాజీ న్యూస్ రీడర్ శాంతి స్వరూప్ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. రెండు రోజుల క్రితం గుండెపోటుతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరిన ఆయన చికిత్స పొందుతూ కన్నుమూశారు. దూరదర్శన్‌లో తొలి తెలుగు న్యూస్ రీడర్‌గా శాంతి స్వరూప్‌కు ఓ గుర్తింపు ఉంది. "నమస్కారం... ఈ రోజు వార్తల్లో ముఖ్యాంశాలు" అంటూ ఏళ్లపాటు అలరించిన ఆ గాత్రం మూగబోయింది. గ్రాడ్యుయేషన్ చేసిన శాంతి స్వరూప్ 1978లోనే దూరదర్శన్‌లో చేరారు. అయితే యాంకరింగ్ చేసేందుకు ఆయన ఐదేళ్లు ఎదురు చూడాల్సి వచ్చింది. 1983 నవంబరు 14న ప్రసారమైన దూరదర్శన్ తెలుగు తొలి బులిటెన్ వార్తల్ని చదివి వినిపించారు. టెలి ప్రాంప్టర్ (ఎదురుగా స్క్రీన్ మీద చూసి) లేని రోజుల్లో స్క్రిప్ట్ పేపర్లనే బట్టీ పట్టి వార్తలు వినిపించడంలో ఆయన ఆరి తేరారు. అలా పదేళ్ల పాటు స్క్రిప్ట్‌పేపర్లతోనే వార్తలు చదువుతూ వచ్చారు. 2011లో పదవీ విరమణ చేసే వరకూ ఆయన వార్తలు చదివారు. చాలా మంది న్యూస్ రీడర్లు శాంతి స్వరూప్‌ను తమ గురువుగా భావిస్తుంటారు. అయితే 24/7 పేరిట న్యూస్ రంగంలో తర్వాతి కాలంలో వచ్చిన మార్పులను ఆయన స్వాగతించలేకపోయారు. వార్తలు చదవకండి... వార్తలు చెప్పండి... అని తర్వాతి తరం యాంకర్లకు సూచించారు. శాంతి స్వరూప్ సతీమణి రోజా రాణి కూడా న్యూస్ రీడర్. 1980లో వీళ్లకు వివాహం జరగ్గా వీళ్లకు ఇద్దరు సంతానం. విదేశాల్లో స్థిరపడ్డారు. సాహిత్యంపై పట్టున్న శాంతి స్వరూప్ భోపాల్ గ్యాస్ దుర్ఘటన మీద "రాతి మేఘం" అనే నవల రాశారు. క్రికెట్ మీద మక్కువతో 'క్రేజీ', సతీ సహగమన దురాచారానికి వ్యతిరేకంగా 'అర్థాగ్ని' అనే నవల రాశారు. యాంకరింగ్‌లో లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు.

జగన్, చంద్రబాబు సంతాపం

తొలితరం తెలుగు న్యూస్ రీడర్ శాంతి స్వరూప్ మృతికి సీఎం వైఎస్ జగన్, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు. శాంతి స్వరూప్ ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుడిని ప్రార్థించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరిమిత సాంకేతిక పరిజ్ఞానం ఉన్న రోజుల నుంచి శాంతి స్వరూప్ మార్గదర్శక ప్రయత్నం చాలా మంది వార్తా ప్రసారకులకు స్ఫూర్తినిచ్చిందని జగన్ పేర్కొన్నారు. తొలి తెలుగు న్యూస్ రీడర్, యాంకర్, రచయిత శాంతి స్వరూప్ మరణం దిగ్భ్రాంతిని కలిగించిందని, తెలుగు దూరదర్శన్‌లో వార్తలు అనగానే మొదటగా గుర్తొచ్చేది శాంతి స్వరూప్ అని చంద్రబాబు తెలిపారు. తాను ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మేమిద్దరం కలిసి 'ప్రజలతో ముఖ్యమంత్రి' అనే కార్యక్రమాన్ని ప్రతి సోమవారం చేసేవాళ్లమని, ఆరు సంవత్సరాల పాటు సాగిన ఈ కార్యక్రమంలో ప్రజలు నేరుగా తమ సమస్యలను చెప్పుకుని పరిష్కారం పొందేవారని గుర్తుచేశారు.

సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం

తొలి తెలుగు న్యూస్ రీడర్ శాంతి స్వరూప్ మృతిపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. తెలుగు వార్తలు చదివిన తొలి తరం న్యూస్ రీడర్‌గా శాంతి స్వరూప్ తెలుగు రాష్ట్రాల ప్రజలకు సుపరిచితులు. 1983 నుంచి 2011లో పదవీ విరమణ చేసేంత వరకు ఆయన సుదీర్ఘ కాలం పాటు దూరదర్శన్‌లో అందించిన సేవలు తెలుగు మీడియా రంగంలో చిరస్మరణీయమని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఇదిలా ఉండగా, శాంతి స్వరూప్ మృతిపై పలువురు ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంత్రులు, మాజీ మంత్రులు సహా ఆయన మరణంపై సంతాపం తెలిపారు. 'తొలి తరం న్యూస్ రీడర్' గా అందరికీ సుపరిచితులైన శాంతి స్వరూప్ మృతి బాధాకరమన్నారు.

ఆక్వారంగానికి పూర్వ వైభవం

నర్సాపురం సభలో
చంద్రబాబు హామీ

విశాలాంధ్ర-నరసాపురం: వైసీపీ ప్రభుత్వం రైతులను దగా చేసిందని చంద్రబాబు మండి పడ్డారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాగళం సభలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆక్వా రంగానికి పూర్వవైభవం తెస్తా మన్నారు. జగన్ పాలనలో అన్ని రంగాలు పతనావస్థకు చేరాయని ధ్వజమెత్తారు. రాష్ట్ర ఆక్వా రంగాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా నిలిపగా వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా పడిపోయిందని చంద్రబాబు అన్నారు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆక్వా రంగానికి పూర్వ వైభవం తీసుకువస్తానని రైతులకు చంద్రబాబు హామీ ఇచ్చారు. అంతే కాకుండా రైతులకు రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం చేసి అన్నదాతను ఆదుకుని రాజును చేస్తామన్నారు. వైసీపీ విముక్త రాష్ట్రంగా చేయాలనేది పవన్ ఆకాంక్ష అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయ కత్వంలోనే భారత్ నంబర్ వన్‌గా తయారవు తుందని దేశాన్ని అగ్రగామిగా మార్చేందుకు మోదీ అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. రాష్ట్రంలో పండించిన పంటను అమ్ముకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని 2014లో రైతు రుణమాఫీ చేసిన ఘనత టీడీపీదేనన్నారు. వృద్ధులు వికలాంగులు పింఛన్లు ఇవ్వలేక శవ రాజకీయాలు చేసే వ్యక్తి జగన్ అన్నారు. జగన్ పాలనలో యువతకు ఉద్యోగాలు తేలేదు గాని గంజాయి, లిక్కరు పుష్కలంగా తెచ్చారని చంద్రబాబు ఎద్దేవా చేశారు. టీడీపీ-జనసేన-బీజేపీ ప్రభుత్వం రాగానే తల్లికి వందనం కార్యక్రమం కింద మహిళలకు రూ.15వేలు అందిస్తామన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు సంపద సృష్టించడం అంటే అప్పులు చేయడం కాదని... తాము సంపాదించే అవకాశం ప్రజలకు కల్పిస్తా మని చెప్పారు. నరసాపురం ఎమ్మెల్యే ముదు నూరి చాలా ముదురని ఎద్దేవా చేశారు. ఏటిగట్టు పనులలో దోచేశారని, రూ.కోట్లు ఇసుకలో కొట్టేసిన ముదురు ముదునూరి అన్నారు. పీఎం లంకలో సముద్ర కోతకు గురైన ప్రాంతంలో గట్టు నిర్మిస్తామని, బియ్యపు తిప్ప హర్బరు, గోదావరి వశిష్ఠ వంతెన నిర్మాణం చేపడతామని బాబు హామీ ఇచ్చారు. తొలుత సీతారామపురం హెలిప్యాడ్ వద్ద చంద్రబాబుకు నరసాపురం అసెంబ్లీ అభ్యర్థి బొమ్మిడి నాయకర్, పార్లమెంట్ అభ్యర్థి శ్రీనివాస్ వర్మ, టీడీపీ జిల్లా అధ్యక్షులు తోట సీతారామలక్ష్మి, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు స్వాగతం పలికారు. అనంతరం జాతీయ రహదారిపై రోడ్డు షో చేస్తూ ప్రజాగళం సభా వేదిక వద్దకు బయలు దేరారు. పట్టణంలోని టాయ్ సిటీ నుండి రుస్తుంబాద గవర్నమెంట్ హాస్పిటల్ మీదుగా కాన్వాయ్ సాగింది. జనసేన పార్టీ కార్యాలయం వద్ద చంద్రబాబుకు తెలుగు, వీర మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. పంజా సెంటర్లో ముస్లిం సమస్యలపై మాజీ శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్ అధ్వర్యంలో చంద్రబాబుకు వినతి పత్రం అందజేశారు. ముస్లిం సోదరులు శాలువాలతో సత్కరించారు. మంగిన వారి సెంటర్లో స్థానికులు చంద్రబాబును భారీ గజమాలతో సన్మానించారు. దర్బరేవులోని ఆక్వా రైతులు చంద్రబాబుకు వనామి రొయ్యల బాక్స్‌ను బహుమతిగా అందించారు. ఫీడు మిల్లులు ఫీడు ధర తగ్గించాలని,ప్రభుత్వం కనీసం మండలానికి ఒక కోల్డ్ స్టోరేజీ నిర్మించాలని, ఆక్వా రైతులను ప్రస్తుత సంక్షోభం నుంచి కాపాడాలంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. వైన్ కాలేజ్ మీదుగా రైతు బజార్, స్టీమర్ రోడ్డు ద్వారా చంద్రబాబు ప్రజాగళం సభకు చేరుకున్నారు. సుమారు గంటసేపు ఈ రోడ్ షో జరిగింది.

సీనియర్ కమ్యూనిస్టు కప్పల లింగమ్మ కన్నుమూత

విశాలాంధ్ర-హైదరాబాద్: నల్లగొండ జిల్లా సూర్యాపేటకు చెందిన కమ్యూనిస్టు పార్టీ సీనియర్ సభ్యురాలు కప్పల లింగమ్మ (90) శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాదులో కన్నుమూశారు. కొంతకాలంగా ఆమె వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. నాగోల్‌లోని చిన్న కుమారుడి ఇంట్లో ఆమె మరణించారు. స్వస్థలం సూర్యాపేటలో శనివారం ఆమె అంత్యక్రియలు నిర్వహించనున్నారు. లింగమ్మ పెద్ద కుమారుడు కేవీఎల్ సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు, ఇప్సో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. చిన్న కుమారుడు కె.శ్రీనివాస్ ప్రజాపక్షం దినపత్రికలో హైదరాబాద్ బ్యూరో స్టాఫ్ రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్ తల్లి రాములమ్మ, లింగమ్మ సొంత అక్కచెల్లెళ్లు. లింగమ్మ సూర్యాపేట జిల్లా మోతె గ్రామంలో జన్మించారు. నిజాం వ్యతిరేక పోరాట కాలంలో అజ్ఞాతంలో ఉన్న ధర్మభిక్షం ఆచూకీ చెప్పనందుకు ఆమె తండ్రిని రజాకార్లు పట్టపగలు కాల్చి చంపిన ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. అజ్ఞాతంలో ఉన్న దళ సభ్యులకు ఆమె ఆహారం అందించడంతోపాటు కొరియర్‌గా పనిచేశారు. పిల్లలు పుట్టిన కొద్ది సంవత్సరాలకే భర్త వీరయ్య అకాల మరణంతో లింగమ్మ కష్టపడి కుటుంబాన్ని అభివృద్ధిలోకి తీసుకువచ్చారు. కమ్యూనిస్టు పార్టీ పట్ల అమితమైన అభిమానంతో ఎక్కడ సభలు, ఎన్నికలు జరిగినా తప్పక అందులో భాగస్వామి అయ్యేవారు. బొమ్మగాని వెంకటయ్య నేతృత్వంలో గీత పనివారల సంఘం పిలుపు మేరకు పెద్దసంఖ్యలో మహిళలను కూడగట్టి లింగమ్మ నల్లగొండలో జరుగుతున్న అబ్కారీ హర్రాజు పాటలను అడ్డుకున్నారు. సూర్యాపేటలో సొసైటీ రక్షణ తాటి ఈత మన పెంపకంలో క్రియాశీల పాత్ర వహించారు. సూర్యాపేటలో నీటి సంఘానికి జరిగిన ఎన్నికల్లో సీపీఐ తరపున డైరెక్టర్‌గా పోటీ చేసి విజయం సాధించారు. నీటి సంఘానికి ఉపాధ్యక్షురాలిగా వ్యవహరించారు.

గత పాలకుల తప్పులు సరిదిద్దడంలో
వామపక్షాలది కీలక పాత్ర

- ఎన్‌డీఏ సంగతి ప్రజలకు తెలుసు - ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ మధ్యే పోటీ
- ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని పరిరక్షించే ప్రభుత్వం అవసరం
- సీపీఐ సీనియర్ నేత పన్నియన్ రవీంద్రన్

తిరువనంతపురం: గత ప్రభుత్వాల తప్పిదాలను సరిదిద్దే విషయంలో ప్రభావవంతంగా పని చేయడంలో, మహానగరం తిరువనంతపురం సామర్థ్యాన్ని వినియోగించుకోవడంలో వామపక్షాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని సీపీఐ కేరళ రాష్ట్ర మాజీ కార్యదర్శి పన్నియన్ రవీంద్రన్ అన్నారు. వరుసగా నాల్గవసారి విజయ లక్ష్యంతో ఉన్న కాంగ్రెస్ నాయకుడు శశిథరూర్ నుంచి తిరువనంతపురం నియోజకవర్గాన్ని కైవసం చేసుకునేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అభ్యర్థిగా పన్నియన్ రవీంద్రన్ లోక్‌సభ ఎన్నికల బరిలో ఉన్నారు. 2005లో అపూర్వమైన ఓట్ల మెజార్టీతో వామపక్ష ప్రజాస్వామ్య కూటమి(ఎల్‌డీఎఫ్)కి విజయాన్ని అందించిన ఆయన... ప్రస్తుత ఎంపీపై వచ్చిన ఆరోపణలను నొక్కి చెబుతూ మరింత విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. కేరళ రాజధానిపై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వ్యతిరేక విధానాన్ని ఆయన దుయ్యబట్టారు. 'ది హిందూ' దినపత్రికకు రవీంద్రన్ ఇచ్చిన ఇంటర్వ్యూలో అనేక అంశాలను ప్రస్తావించారు. గత ప్రభుత్వాల తప్పులు సరిదిద్దడంలో, తిరువనంతపురం మహానగరాన్ని సమర్థంగా వినియోగించుకోవడంలో వామపక్షాల కీలకపాత్ర గురించి చర్చించారు. 'ఇండియా' కూటమిలో భాగస్వామిగా ఉండి... కేరళలో ఎన్నికల ప్రచారంలో కూటమికి ఎలా ప్రత్యామ్నాయంగా నిలిచిందన్న ప్రశ్నకు స్పందిస్తూ.... మొదటి ఐక్య ప్రగతిశీల కూటమి (యూపీఏ) ప్రభుత్వ హయాంలో (2004 నుంచి 2009 వరకు) చూపినట్లుగా, పాలకుల తప్పులను సరిదిద్దే విషయంలో ప్రభావవంతంగా పని చేయడంలో వామపక్షాలు కీలకపాత్ర పోషించాయన్నారు. ఇటీవల సంవత్సరాలలో దేశంపై గణనీయమైన ప్రభావాన్ని చూపిన అనేక సంచలనాత్మక చట్టాల అమలులో తాము కీలక పాత్ర పోషించామని తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు చట్టం, అటవీ హక్కుల చట్టం వీటిలో కొన్ని ముఖ్యమైనవని చెప్పారు. ఎన్నికల బాండ్ల కుంభకోణానికి సంబంధించి బీజేపీ, కాంగ్రెస్ మధ్య వ్యత్యాసం చాలా తక్కువగా కనిపిస్తోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయడానికి, లౌకికవాదాన్ని పరిరక్షించడానికి, పౌరులందరికీ గౌరవంగా జీవించే హక్కును నిర్ధారించడానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం దేశానికి అవసరమని, ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే వామపక్షాలకు కేంద్రస్థాయిలో తగిన ప్రాతినిధ్యం కల్పించడం తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఈసారి ఇండియా కూటమి విజయావకాశాలపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ మునుపటి ఎన్నికల్లో 20 సీట్లకుగాను యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) 19 స్థానాలు దక్కించుకోవడానికి అనేక అంశాలు దోహద పడ్డాయన్నారు. శబరిమల మహిళల ప్రవేశ వివాదానికి తోడు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని వయనాడ్ నుంచి పోటీకి ఎంపిక చేయడం కేరళ వ్యాప్తంగా ప్రతిధ్వనించిందన్నారు. కాంగ్రెస్ మాత్రమే మైనారిటీ వర్గాల ప్రయోజనాలు కాపాడగలదని, బీజేపీ, ఇతర మితవాద వర్గాల ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోగలదని నొక్కిచెప్పే ప్రచారాన్ని ప్రారంభించిందని రవీంద్రన్ వివరించారు. ఈసారి ప్రబలమైన 'ప్రభావం' లేనప్పటికీ, కేరళ ఆందోళనలను పరిష్కరించడంలో, రాష్ట్రానికి అభివృద్ధి ప్రాజెక్టులు సాధించడంలో యూడీఎఫ్ ఎంపీలు విఫలమైనట్లు ఓటర్లు గుర్తించారని చెప్పారు. 'తిరువనంతపురం కోస్తా ప్రాంతంలో యూడీఎఫ్ ఓట్లలో గణనీయమైన కోతను ఎదుర్కొంటుందని అంచనా. స్థానిక సమాజాల నిరసనల మధ్య అదానీ గ్రూప్, విజింజం అంతర్జాతీయ నౌకాశ్రయ ప్రాజెక్టుకు శశి థరూర్ మద్దతు ఇవ్వడం వల్ల ఓటర్లలో గణనీయమైన భాగం దూరమైంది. అంతేకాకుండా, పౌరసత్వ (సవరణ) చట్టం, హమాస్, అయోధ్య రామమందిరం వంటి సమస్యలపై శశి థరూర్ వైఖరి అతని ఎన్నికల విజయంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ అంశాలు ఎల్‌డీఎఫ్‌కు అనుకూలంగా ఓట్లు పడేందుకు దోహదం చేస్తామని భావిస్తున్నారు' అని తెలిపారు. ఇంకా, 2021 అసెంబ్లీ ఎన్నికల సమయంలో తిరువనంతపురం లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఎల్‌డీఎఫ్ లక్షకు పైగా ఓట్ల ఆధిక్యాన్ని సాధించిందని, ప్రస్తుతం ఈ ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆరింటిలో ఎల్‌డీఎఫ్ ప్రాతినిధ్యం వహిస్తున్నదన్నారు. తిరువనంతపురంలో ఎల్‌డీఎఫ్ ఎన్నికల ప్రణాళిక ఏమిటని ప్రశ్నించగా, తిరువనంతపురంలోని ఓటర్లు సాధారణంగా 15 సంవత్సరాలుగా అభివృద్ధి జరగకపోవడంపై, రాష్ట్ర రాజధానిగా, అలాగే సమృద్ధిగా వనరులు, భౌగోళిక ప్రయోజనాలను కలిగి ఉన్న తిరువనంతపురం నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందన్నారు. 'ఉదాహరణకు, అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) కోసం రాష్ట్రానికి సంబంధించిన దీర్ఘకాల డిమాండ్ నెరవేరలేదు. చాలా ఇతర రాష్ట్రాలకు ఎయిమ్స్ సౌకర్యాలు కేటాయించ బడినప్పటికీ, కేరళ ఇప్పటికీ ఆ ఒక్కదాని కోసం వేచి ఉంది. ఈ పరిస్థితికి యూడీఎఫ్ బాధ్యత వహిస్తుంది. ఊమెన్ చాందీ ప్రభుత్వ హయాంలో (2004 నుంచి 2006 వరకు), తిరువనంతపురంలో కాకుండా కోజికోడ్‌లో స్థలానికి ప్రాథమిక ప్రతిపాదన వచ్చింది. అయితే, ఈ ప్రతిపాదన వివిధ ప్రమాణాలకు అనుగుణంగా లేనందున భారత వైద్య మండలి (ఎంసీఐ) తిరస్కరించింది.

వడ్డీ రేట్లు యథాతథం

- గృహ, వాహన రుణాల ఈఐఎంలు మరికొంత కాలం స్థిరంగానే...
- వృద్ధి, ద్రవ్యోల్బణ అంచనాలు వరుసగా 7 శాతం, 4.5 శాతం
- కీలక నిర్ణయాలు వెల్లడించిన ఆర్‌బీఐ

న్యూదిల్లీ: భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) శుక్రవారం బెంచ్ మార్క్ వడ్డీ రేట్లను వరుసగా ఏడవసారి 6.5 శాతం వద్ద యథాతథంగా ఉంచింది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు సాధారణం కంటే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయన్న ఐఎండీ అంచనా వేసిన దృష్ట్యా ఆహార ద్రవ్యోల్బణంపై ఆందోళనలను ఉటంకిస్తూ ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను వరుసగా ఏడోసారి ఎలాంటి మార్పు చేయకుండా కొనసాగించింది. దీంతో గృహ, వాహన రుణాలపై ఈఐఎంలు మరికొంత కాలం స్థిరంగా ఉండే అవకాశం ఉంది. కేంద్ర బ్యాంకు ఫిబ్రవరి, 2023 నుంచి వడ్డీ రేట్లను మార్చలేదు. బుధవారం ప్రారంభమైన ఆర్‌బీఐ ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష సమావేశ నిర్ణయాలను గవర్నర్ శక్తికాంత దాస్ శుక్రవారం వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మొదటి ద్వైమాసిక ద్రవ్య విధానాన్ని విడుదల చేస్తూ, ఆర్‌బీఐ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వృద్ధి, ద్రవ్యోల్బణ అంచనాలను వరుసగా 7 శాతం, 4.5 శాతం వద్ద ఉంచింది. అభివృద్ధి చెందుతున్న స్థూల ఆర్థిక, ఆర్థిక పరిణామాలు, దృక్పథానికి చెందిన వివరణాత్మక అంచనా తర్వాత, ద్రవ్యోల్బణ విధాన కమిటీ (ఎంపీసీ) 5 నుంచి 1 మెజారిటీతో పాలసీ రెపో రేటును 6.50 శాతం వద్ద యథాతథంగా ఉంచడానికి నిర్ణయించింది' అని శక్తికాంత దాస్ తెలిపారు. వృద్ధికి మద్దతునిస్తూ ద్రవ్యోల్బణం క్రమంగా లక్ష్యానికి అనుగుణంగా ఉండేలా చూసేందుకు ఆరుగురు సభ్యుల ద్రవ్యోల్బణ విధాన కమిటీ దృష్టి సారిస్తుందని అన్నారు. ద్రవ్యోల్బణాన్ని ప్రస్తావిస్తూ దాస్ మాట్లాడుతూ ఆహార ధరల అనిశ్చితులు ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపుతున్నాయని, పప్పు దినుసులలో గట్టి డిమాండ్-సరఫరా పరిస్థితి, కీలకమైన కూరగాయల ఉత్పత్తి, రాబోయే నెలల్లో సాధారణంకంటే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే సూచనల ప్రకారం నిశిత పర్యవేక్షణ అవసరమని తెలిపారు. 'గోధుమ కోత చాలా ఎక్కువగా ఉంది. మార్చి నుంచే వేడిగాలుల పరిస్థితులు ఉన్నప్పుడు రెండు సంవత్సరాల క్రితం మాదిరిగా గోధుమ లభ్యత ప్రభావితం కాదు. కానీ కూరగాయల ధరలను గమనించాలి. వేడి గాలుల పరిస్థితులు ఉత్పన్నమయ్యే ఏదైనా ఇతర ప్రభావాన్ని చూడాల్సి ఉంది' అని ఆయన అన్నారు. ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.1 శాతంగా ఉంది. ఆహార బాస్కెట్ ద్రవ్యోల్బణం 8.66 శాతంగా ఉంది. పూర్తి 2023-24 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం 5.4 శాతంగా అంచనా వేయబడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ ద్రవ్యోల్బణం దాదాపు 4.5 శాతం ఉంటుందని అంచనా వేస్తుంది. మొదటి త్రైమాసికం వద్ద 4.9 శాతం, రెండో త్రైమాసికం వద్ద 3.8 శాతం, మూడవ త్రైమాసికం వద్ద 4.6 శాతం, నాల్గవ త్రైమాసికం వద్ద 4.5 శాతం. 2022 ఏప్రిల్‌లో 7.8 శాతం రిటైల్ ద్రవ్యోల్బణాన్ని గుర్తుచేస్తూ, నిరంతర ప్రాతిపదికన ధరల స్థిరత్వాన్ని నిర్ధారించడం, అధిక వృద్ధికి నిరంతరాయంగా మార్గం సుగమం చేయడం ఈ ప్రయత్నం అని ఆయన అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వ్యవస్థ 7 శాతం వృద్ధి చెందుతుందని అంచనా వేస్తున్నట్లు దాస్ తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.